
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
మంగళవారం 3 డిసెంబరు 2024





మిర్చి యార్డులో కలవరం

- అధికారులు, ఇద్దరు సెక్రటరీలపై తీవ్ర అభియోగాలు
- ఇద్దరు ఇన్‌చార్జీలు, 12 మంది సూపర్‌వైజర్లపై కూడా
- విజిలెన్స్ విచారణతో చర్యలకు ఆదేశించనున్న ప్రభుత్వం

గుంటూరు సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వందల కోట్ల రూపాయల అక్రమాలు విజిలెన్స్ విచారణలో వెలుగులోకి రావటంతో గుంటూరు మిర్చియార్డులో కలవరం మొదలైంది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో యార్డులో పనిచేసిన 20 సిబ్బంది పేర్లు చేర్చటం చర్చనీయాంశంగా మారింది. ఇద్దరు అధికారులు, ఇద్దరు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీలు, ఇద్దరు యార్డు ఇన్‌చార్జీలు, 12మంది సూపర్‌వైజర్లపై తీవ్రమైన అభియోగాలు నమోదు అయినట్లు తెలుస్తోంది. నివేదికను ఆధారం చేసుకుని ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉండటంతో గత ఐదేళ్లలో యార్డులో పనిచేసిన అధికారులు, సిబ్బంది గుండెల్లో రైళ్లు పరుగెత్తున్నాయి.ప్రస్తుతం అప్పట్లో పనిచేసిన సిబ్బందిలో కొద్దిమంది మాత్రమే యార్డులో ఉన్నారు. మిగిలినవాళ్లు ఆయా ప్రదేశాల్లో పనిచేస్తున్నారు. యార్డులో ప్రస్తుతం 34మంది పనిచేస్తుండగా, 10మంది పేర్లు విజిలెన్స్ నివేదికలో ఉన్నట్లు సమాచారం.

ఆదాయం కోసం స్థాయి మార్పు..

గుంటూరు మిర్చియార్డులో ప్రతి ఏటా సుమారు రూ.వెయ్యి కోట్ల వ్యాపారం జరుగుతుండగా, రూ.100కోట్ల వరకు ఆదాయం చేకూరుతోంది. వాస్తవానికి గుంటూరు మిర్చియార్డుకు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీని నియమించాలి. అర్హత కలిగిన సెక్రటరీలు ఉన్నప్పటికీ మార్కెటింగ్ కమిషనర్‌తో సత్సంబంధాలు కలిగిన అధికారులు స్థాయి తగ్గించుకొని అధిక ఆదాయం కలిగిన (మిగతా 8వ పేజీలో..)

డైరెక్టర్ సీరియస్ ?

గుంటూరు మిర్చియార్డులో జరుగుతున్న అవకతవకలపై వస్తున్న కథనాలపై మార్కెటింగ్ డైరెక్టర్ సీరియస్ అయినట్లు తెలుస్తోంది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనంపై కమిషనర్ కార్యాలయం ఆరా తీసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావటంతోనే కొందరిపై వేటుపడవచ్చని చెబుతున్నారు.





ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూల మూలకు విస్తరించి వున్న రేషన్ మాఫియా గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అక్రమార్కుల ఆట కట్టించేందుకు ప్రయత్నించినా ఏమాత్రం వెరువని రేషన్ మాఫియా తాజా పరిణామాల నేపథ్యంలో ఒకింత ఆందోళనకు గురయింది. నేరుగా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం రేషన్ మాఫియాపై దృష్టి సారించడంతో వారంతా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.



మాఫియా ఏరేషన్!

- ప్రభుత్వం దృష్టి సారించడంతో అధికారుల అప్రమత్తం
- కఠిన చర్యలు తప్పవంటూ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు హెచ్చరికలు
- గత కొంతకాలంగా ఇష్టారాజ్యంగా రేషన్ మాఫియా
- సిండికేట్‌గా ఏర్పడి ఇష్టారాజ్యంగా పేదల బియ్యం దోపిడీ
- బినామీ షాపులతో అడ్డూ అదుపులేని అక్రమాలు

గుంటూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో విస్తరించిన రేషన్ మాఫియా జిల్లాలు, రాష్ట్రాలు, దేశాలు దాటి రేషన్‌మాఫియా అక్రమాలు ఖండాంతరాలు చేరింది. సరిహద్దు రాష్ట్రమైన తెలంగాణ మీదుగా కర్నాటక, గుజరాత్, ఇతర ఉత్తరాది రాష్ట్రాలకు పేదల బియ్యాన్ని తరలించడమే కాకుండా కాకినాడ పోర్టు ద్వారా ఇతర దేశాలకు కూడా తరలిస్తున్న ఘటనలు అనేకం ఉన్నాయి. వీటిని కట్టడి చేయడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా అక్రమాలు మాత్రం అణువంత కూడా తగ్గలేదు. రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమయింది. స్వయంగా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కాకినాడ పోర్టులో తనిఖీలు చేపట్టి, అక్రమార్కులపై చర్యలకు ఉపక్రమించారు. దీంతోపాటు స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా హెచ్చరికలు చేయడంతో మాఫియా గుండెల్లో రైళ్లు పరిగెత్తు తున్నాయి. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తీవ్ర హెచ్చరికలు చేసిన నేపథ్యంలో జిల్లా అధికారులు కూడా రేషన్‌మాఫియాపై అప్రమత్తమయ్యారు. ఇప్పటికే జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు, విజిలెన్స్, రెవిన్యూ అధికారులు మాఫియాకు హెచ్చరికలు పంపించారు. అక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఇటు రేషన్‌డీలర్లకు, అటు ఎండీయూ వాహనదారులకు హెచ్చరికలు పంపారు.

అడ్డూ అదుపులేని రేషన్ మాఫియా..

పేదల ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం రేషన్ షాపులకు చేరకముందే మాఫియా గూటికి చేరిపోయిన ఘటనలు జిల్లాలో అనేకం నమోదయ్యాయి. ప్రతి నెలా ఒకటో తేదీన ప్రజలకు అందాల్సిన బియ్యం ముందు నెల 25వ తేదీ లోపు రేషన్ షాపులకు చేరుతుంది. కానీ కిందటి నెల 28వ తేదీకల్లా అనేక రేషన్ షాపులు ఖాళీ అయిపోయాయి. బియ్యం అక్రమార్కుల చెంతకు చేరిపోయాయి. దీనిపై విచారణ జరిపి అధికారులు చర్యలు తీసుకున్నా పద్ధతిలో మార్పు రాలేదు.

ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి నేరుగా మాఫియాకు..

రేషన్ డీలర్లకు బియ్యం అందించే మండల స్థాయి స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్ల నుంచే నేరుగా పేదల బియ్యం మాఫియా డంప్‌కు చేరిపోతున్న ఘటనలు అత్యంత ఆందోళనకర పరిణామం. జిల్లాలో రెండు మూడు రేషన్ షాపులు ఒక్కటై ఈ దందా చేస్తున్నాయి. మూడు షాపుల్లో ఒక షాపుకు స్టాకు రాకుండా నేరుగా మాఫియాకు పంపిస్తారు. మిగిలిన రెండు షాపులు మూడో షాపుకు సరుకు సరఫరా చేస్తాయి. అధికారుల తనిఖీల సమయంలో ఒకరికి ఒకరు సహకరించుకుని తప్పించుకుంటున్నారు. దీంతోపాటు చాలా చోట్ల రేషన్ షాపు పక్కన మాఫియా స్టాక్ పాయింట్ పెట్టుకుని అక్కడే బియ్యాన్ని డంప్ చేసుకుని

(మిగతా 8వ పేజీలో..)



అసైన్డ్ రైతులకు కౌలు

- సీఐడీ 'నాట్ ట్యాలీడ్' ఉచ్చు నుంచి రైతులకు విముక్తి
- కలెక్టర్ విచారణతో నాట్ ట్యాలీడ్ జాబితా రైతులకు మోక్షం
- కేటగిరీ 1, 2, 3 నుంచి 609 మందికి, 5,6 కేటగిరీల్లో 484 మందికి కౌలు
- రిజిస్ట్రేషన్లకు ఎలాంటి ఆటంకమూ ఉండబోదు
- ఏపీ సీఆర్డీఏ కమిషనర్

గుంటూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజధాని కోసం ల్యాండ్ పూలింగ్ స్కీము కింద భూములిచ్చిన అసైన్డ్ రైతుల్లో మరో 1,093 మంది రైతులకు కౌలు కష్టాలు తీరనున్నాయి. గత ప్రభుత్వం నమోదు చేసిన సీఐడీ కేసుల కారణంగా 'నాట్ ట్యాలీడ్' జాబితాలో చేరి అనర్హతబారిన పడి మూడేళ్లుగా కౌలుకు, చట్టబద్ధంగా రావాల్సిన ప్రయోజనాలకు దూరమైన అసైన్డ్ రైతులకు కూటమి ప్రభుత్వం రాకతో మోక్షం కలిగింది. గత నెల 28వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన 'రిజిస్ట్రేషన్ల గండం' వార్తపై సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ స్పందించారు. తొలి విడత జాబితా కింద ఈ ఏడాది ఆగస్టులో 1,234 మంది అసైన్డ్ రైతులను 'నాట్ ట్యాలీడ్' జాబితా నుంచి విముక్తి చేసి కౌలు చెల్లించిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో 1,093 మందికి కౌలు చెల్లించనున్నామని, వారి రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు ఎలాంటి ఆటంకమూ ఉండబోదని సీఆర్డీఏ కమిషనర్ తెలియజేశారు.

కలెక్టర్ విచారణ అనంతరం విముక్తి

రాజధాని కోసం ఎల్‌పీఎస్ స్కీము కింద భూములిచ్చిన అసైన్డ్ రైతులను ఆరు కేటగిరీలుగా గుర్తించామని చెప్పారు. కేటగిరీ-1 గా మాజీ సైనికులు, స్వాతంత్ర సమరయోధులు, రాజకీయ బాధితుల భూములు, కేటగిరీ- 2, 3 కింద 1954కి ముందు అసైన్ చేసిన భూములు, కేటగిరీ- 4 కింద శివాయజమేదార్లుగా పరిగణించిన భూములు, కేటగిరీ- 5 కింద అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో అర్హులైన ఆక్రమణదారులు, కేటగిరీ- 6 కింద అభ్యంతరం ఉన్న ప్రభుత్వ భూముల్లో అర్హులైన ఆక్రమణదారులుగా గుర్తించారు. ల్యాండ్ పూలింగ్‌లో వీరంతా భూములివ్వగా అప్పటి టీడీపీ ప్రభుత్వం

(మిగతా 6వ పేజీలో..)

6

మిర్చి వ్యాపారస్తులతో నేడు అధికారుల భేటీ

- సర్క్యులర్లు జారీ చేసిన సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ

4.2 కిలోల గంజాయి స్వాధీనం

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు మరో 14 రోజుల రిమాండ్

ఢిల్లీలో గుంటూరు మహిళల ప్రతిభ

- ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో మొదటి బహుమతి కైవసం

8

విడిపోతాం

- భారీగా పెరుగుతున్న విడాకుల కేసులు
- అక్కరకు రాని కౌన్సిలింగ్ కేంద్రాలు



వీరారాధన ఉత్సవాల్లో ముగిసిన 'మందపోరు'

- కొణతాలకు నాగులేటిలో స్నానాలు.. ఊరేగింపు



బ్రహ్మనాయుడి నృసింహకుంతాన్ని చేతబూనిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి తదితరులు

రోడ్డున పడ్డ... విద్యుత్ మీటర్లు

- విద్యుత్‌శాఖ సెక్షన్ కార్యాలయాల్లో అవినీతి తాండవం
- వీధి వ్యాపారుల నుంచి వసూళ్ళు.. విద్యుత్ మీటర్ల ఏర్పాటు
- ఇటీవల దుకాణాల తొలగింపుతో బయటపడిన వందలాది విద్యుత్ మీటర్లు
- వైసీపీ హయాంలో నేతలు చెబితే చాలు.. నిబంధనలు బేఖాతరు..
- మీటర్లు ఇవ్వొద్దంటూ జీఎంసీ అధికారుల ఆదేశాలు

గుంటూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కొత్త కనెక్షన్‌లు కావాలంటే సవాలక్ష నిబంధనలు చెప్పే ఆ శాఖ అధికారులు కొందరు కాసుల కోసం కక్కుర్తి పడి అడ్డగోలుగా విద్యుత్ మీటర్లు జారీ చేసిన వైనం తాజాగా వెలుగులోకి వచ్చింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు చెప్పిందే తడవుగా వీధి వ్యాపారులకు విద్యుత్‌మీటర్లు విచ్చలవిడిగా ఇచ్చేశారు. అంతేగాక వీధి వ్యాపారుల నుంచి రూ. 5వేల నుంచి రూ.10వేల వరకు అందినంత వరకు జేబుల్లో వేసుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పులి శ్రీనివాసులు రహదారులను సైతం ఆక్రమించి వెలసిన అనేక దుకాణాలను తొలగించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వీధి పక్కల విద్యుత్ మీటర్లు పెద్ద ఎత్తున బయటపడ్డాయి. జీజీహెచ్ చుట్టు పక్కల, లక్ష్మీపురం వాటర్ ట్యాంకుల పక్కన, మార్కెట్ సెంటర్‌తో పాటు పలు ప్రధాన రహదారుల్లో విద్యుత్ మీటర్లు పెద్ద ఎత్తున దర్శనమిచ్చాయి. మొత్తం మీద వాటి సంఖ్య వందల్లోనే ఉండొచ్చని చెబుతున్నారు. ఆయా విద్యుత్ మీటర్లు చూసిన జీఎంసీ అధికారులు, సాధారణ జనం నోరెళ్ళ బెట్టాల్సినంత పనైంది. వాస్తవానికి వీధి పక్కన విద్యుత్‌కనెక్షన్ ఉండాలంటే నగరపాలక సంస్థ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. లేక పన్ను రశీదు, సంబంధిత పత్రాలు లేకుండా విద్యుత్‌కనెక్షన్‌ఇచ్చేందుకు నిబంధనలు ఉంటాయి. అవేమి లేకుండానే అప్పటి అధికారంలో ఉన్న వైసీపీ నేతలు, చోటా , మోటా నాయకులు చెప్పిందే తడవుగా విద్యుత్‌శాఖ సెక్షన్ కార్యాలయాల్లో అధికారులు, కింది స్థాయి సిబ్బంది విచ్చలవిడిగా ఎల్‌టీ కేటగిరీ- 2 కింద విద్యుత్ మీటర్లు ఇచ్చేశారు. అంతేగాక వైసీపీ నాయకులు చెప్పటంతో పాటు వీధి వ్యాపారుల నుంచి కూడా సెక్షన్ స్థాయిలోని కొందరు అధికారులు, సిబ్బంది మామూళ్ళు పుచ్చుకొని అడ్డగోలుగా వ్యవహరించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

కనెక్షన్‌ల ఏర్పాటులో నిబంధనలు బేఖతారు.....

వీధి వ్యాపారులకు విద్యుత్‌కనెక్షన్లు ఇవ్వాలంటే కొన్ని నిబంధనలు ఉన్నాయి. గతంలో చెరుకురసం స్టాల్స్ ఇతర స్టాల్స్‌కు తాత్కాలిక విద్యుత్‌మీటర్లు ఇచ్చేవారు. సీజనల్ సమయంలో వాడుకొని తరువాత వ్యాపారి చెల్లించిన డిపాజిట్‌ను తిరిగి ఇచ్చేసి మీటర్లు తీసుకెళ్ళేవారు. అటువంటి వాటికి కూడా నగరపాలక సంస్థ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉండేది. ప్రస్తుతం తాత్కాలిక కనెక్షన్‌లు కూడా ఇవ్వకుండా జీఎంసీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

అడ్డగోలు మీటర్లతో లోవోల్టేజ్ సమస్యలు..

అడ్డగోలుగా విద్యుత్‌మీటర్లు ఇవ్వటంతో విద్యుత్‌సరఫరాలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఎక్కడికక్కడ కేటగిరీ - 2 మీటర్లు ఇవ్వటంతో ఫలితంగా లో వోల్టేజీ సమస్యలు వస్తున్నాయి. లోడ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవటంతో సరఫరాలో నాణ్యత లోపిస్తున్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో దృష్టి సారించి నాణ్యమైన విద్యుత్‌సంపరాపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





నిబంధనలకు విరుద్ధంగా వీధి వ్యాపారులకు ఏర్పాటు చేసిన విద్యుత్ మీటర్లు





లక్ష్మీపురం వాటర్ ట్యాంకుల రోడ్డులో గోడకు విద్యుత్ మీటర్లు

రెండు వారాల్లో 4,452 ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన మంత్రి అవాస్ యోజన ద్వారా లక్ష ఇళ్ల గృహ ప్రవేశాలకు జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం 4,452 ఇళ్ల నిర్మాణాన్ని సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆమె అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డిసెంబరు మూడో వారంలో రాష్ట్రంలో పీఎంఏవై ద్వారా నిర్మించిన లక్ష గృహాలు ఒకేసారి ప్రారంభించనున్నారని చెప్పారు. జిల్లాకు కేటాయించిన లక్ష్యంలో ఇప్పటికే 2,400 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. వివిధ దశల్లో ఉన్న మిగతా 2,052 ఇళ్ళ నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేసేలా కమిషనర్లు, ఎంపీడీవోలు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం డిసెంబరు 7వ తేదీన ఘనంగా నిర్వహించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీపీవో శేషశ్రీ, హౌసింగ్ పీడీ ప్రసాదు, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీందర్ బాబు, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, డ్వామా పీడీ శంకర్, డీఈఓ రేణుక, సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి, ఏపీఎంఐపీ అధికారి వజ్రశ్రీ, డిప్యూటీ లేబర్ కమిషనర్ గాయత్రి, భూగర్భ జలనవరుల శాఖ డీడీ వందనం, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు జయలక్ష్మి, డీపీవో సాయికుమార్, విభిన్న ప్రతిభావంతుల ఏడీ సువార్త, లీడ్ బ్యాంక్ మేనేజరు మహిపాల్ రెడ్డి, డీసీపీవో విజయకుమార్ పాల్గొన్నారు.

పూలింగ్ ద్వారా భూములు తీసుకోవాలని తీర్మానం


గ్రామసభలో చేసిన తీర్మానాన్ని చూపిస్తున్న సర్పంచి పద్మజ

అమరావతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో నిర్మించే రైల్వేలైనుకు సంబంధించి మండల పరిధిలోని కర్లపూడి గ్రామానికి చెందిన 240 ఎకరాలు పూలింగ్ ద్వారా తీసుకోవాలని కర్లపూడి గ్రామస్తులు, రైతులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. రైల్వేలైన్‌కు అవసరమైన 430 ఎకరాల్లో 240 ఎకరాలు కర్లపూడి గ్రామానికి చెందినదని గ్రామస్తులు తెలిపారు. సోమవారం సాయంత్రం సర్పంచి ఎం.పద్మజ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో రైతులు పాల్గొని తమ భూమిని పూలింగ్ ద్వారా ప్రభుత్వం తీసుకుని రాజధాని ప్రాంత రైతులకు మాదిరిగా న్యాయం చేయాలని తీర్మానించారు. ఇటీవల రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణను స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో కలసి రైతులు కలిశారు. రైల్వేలైనుకు తీసుకునే భూమికి కేంద్ర ప్రభుత్వ నష్ట పరిహారం, రాష్ట్ర ప్రభుత్వం 400 గజాల స్థలం ఇస్తుందని హామీ ఇచ్చారు. దీనికి రైతులు సర్పంచి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించి పూలింగ్ ద్వారా భూములు ఇచ్చేందుకు నిర్ణయించారు. అలాకాకపోతే రైలు మార్గాన్ని రాజధాని నుంచి నిర్మించుకోవాలని రైతులు తెలిపారు. గతంలో కర్లపూడి రైతులకు చెందిన అనంతవరం, నెక్కల్లు గ్రామ రెవెన్యూ పరిధిలోని 140 ఎకరాలు పూలింగ్‌కు తీసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి ఉషారాణి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఢిల్లీలో గుంటూరు మహిళల ప్రతిభ

● ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో మొదటి బహుమతి కైవసం


బహుమతిని కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ చేతుల మీదగా అందుకుంటున్న లక్ష్మీసామ్రాజ్యం

గుంటూరు సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలు ఢిల్లీ వేదికపై ప్రతిభను చాటారు. నవంబరు 14వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగిన 43వ ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ సరస్ మేళాలో అధిక ఉత్పత్తులు విక్రయించి దేశ స్థాయిలో మొదటి బహుమతి సాధించారు. ఈ నేపథ్యంలో మంగళగిరి మండలంలోని స్నేహ మహిళా గ్రూపు సభ్యురాలైన జి.లక్ష్మీసామ్రాజ్యంను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ సోమవారం కలెక్టరేట్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్మీ, ఆమె భర్త మధుబాబు మంగళగిరి చేనేత వస్త్రాలు (చీరలు, డ్రెస్ మెటీరియల్ మొదలైనవి) మేళాలో ప్రదర్శించి 15 రోజుల్లో మిగిలిన మహిళల అందరికంటే ఎక్కువ అమ్మకాలు జరిపినట్లు వెల్లడించారు. జిల్లా మహిళా సంఘ సభ్యురాలికి మొదటి బహుమతి రావడం గర్వకారణం అన్నారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఏకగ్రీవం



యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీ చేత ప్రమాణ స్వీకారం చేయిస్తున్న కుమార్‌రాజా

నరసరావుపేట టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ పల్నాడు జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైందని ప్రధాన కార్యదర్శి ఎం.మోహనరావు సోమవారం తెలిపారు. గౌరవాధ్యక్షుడుగా షేక్ ఖాసీమ్ పీరా, అధ్యక్షుడుగా కె.శ్రీనివాసరెడ్డి, సహాధ్యక్షుడుగా జె.వాల్యా నాయక్, సహాధ్యక్షురాలుగా ఎ.భాగేశ్వరిదేవి, ప్రధాన కార్యదర్శిగా ఎం.మోహనరావు, కోశాధికారిగా ఎం.రవిబాబు ఎన్నికైయ్యారు. కార్యవర్గం చేత రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు ఎస్.కుమార్‌రాజా ప్రమాణ స్వీకారం చేయించారు. జీవో 117ను రద్దు చేసి పాఠశాలల విలీన ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని, బోధన సమయాన్ని హరిస్తున్న యాప్‌ల భారాన్ని తీసివేయాలని, ఉపాధ్యాయుల సమయాన్ని కేవలం బోధనకే కేటాయించేలా చూడాలని నూతన కమిటీ డిమాండ్ చేసింది. సీపీఎస్, జీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కొత్త పీఆర్సీ కమిషన్‌లను ఏర్పాటు చేసి తక్షణమే మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు.

మిర్చి వ్యాపారస్తులతో నేడు అధికారుల భేటీ

● ఉదయం 11 గంటలకు దిగుమతి వ్యాపారస్తులతో సమావేశం
● సాయంత్రం 4 గంటలకు ఎక్స్‌పోర్టర్లతో మీటింగ్
● సర్క్యులర్లు జారీ చేసిన సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మిర్చి ఎగుమతి, దిగుమతి వ్యాపారస్తులతో మంగళవారం సమావేశం కావాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు అధికార యంత్రాంగం నిర్ణయించింది. మంగళవారం ఉదయం కమిషన్, సాయంత్రం ఎక్స్‌పోర్టు వ్యాపారస్తులతో వేర్వేరుగా సమావేశాలు ఏర్పాటుకు షెడ్యూల్ ఖరారు చేశారు. వ్యాపారస్తులంతా ఆయా సమావేశాలకు విధిగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రధానంగా మిర్చియార్డులో ఈ-నామ్ విధానం లాట్ ఐడీలు జనరేట్ చేయడం మొదలుకొని లాట్ ఎగ్జిట్ వరకు అన్ని దశలలో అమలు చేయాల్సి ఉంది. అలానే బిల్ టూ బిల్, కటింగ్, జీరో వ్యాపారాలన్నీ పూర్తిగా నిలిపేయాలి. వీటితోపాటు మరికొన్ని అంశాలపై సమావేశాల్లో చర్చించనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. ఈ సమావేశాలకు మార్కెటింగ్ ఉన్నతాధికారులు కూడా హాజరయ్యే అవకాశం ఉన్నది.

ఈనామ్ అమలు నామమాత్రమే..

జాతీయ వ్యవసాయ మార్కెట్‌ని ఈనామ్‌గా పరిగణిస్తారు. 2016లో ఈనామ్ అమల్లోకి వచ్చింది. ఈనామ్‌లో రైతులు, ట్రేడర్లు, బయ్యర్లు ఉంటారు. రైతుకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కేంద్రం ఈ విధానాన్ని తీసుకొచ్చింది. ఈనామ్‌లో మిర్చియార్డుకు రైతులు తీసుకొచ్చిన మిర్చి టిక్కీలకు తొలుత లాట్ ఐడీని జనరేట్ చేస్తారు. వాటికి సంబంధించిన శాంపిల్స్‌ని ఈనామ్‌లో ప్రదర్శిస్తారు. వాటికి ఎగుమతిదారులు ఆక్షన్‌లో ధర పేర్కొనాలి. ఆ ధర రైతుకు ఇష్టమైతేనే విక్రయించాలి. లేదంటే తిరస్కరించొచ్చు. ఆక్షన్ అయిపోగానే వెంటనే కాటాలు వేసి ఆ రోజే నగదు చెల్లింపు చేయాలి. ఇది కూడా ఆన్‌లైన్‌లో జరగాలి. ఈనామ్‌కు మొబైల్ యాప్ కూడా ఉండటం వలన సెల్‌ఫోన్‌లోనే అటు రైతులు, ఇటు వ్యాపారస్తులు అన్ని విషయాలను చూసుకోవచ్చు. అయితే గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో కేంద్ర ప్రభుత్వ ఈ-నామ్ విధానం అమలు నామమాత్రంగా ఉంది. ఇతర ప్రాంతాలకు చెందిన ఎక్స్‌పోర్టర్లు ఎవరూ ఇక్కడి మిర్చిని కొనుగోలు చేయరు. తొలుత స్థానిక ఎగుమతిదారులు కమీషన్ వ్యాపారుల దుకాణాలకు వెళ్లి మిర్చి శాంపిల్స్‌ని చూసి ఎంత మోతాదులో సరుకు ఉందో తెలుసుకుంటారు. ఆ తర్వాత కమీషన్ వ్యాపారి, రైతు సమక్షంలో ధర మాట్లాడుకుని ఎలాంటి పోటీ లేకుండా ఈనామ్ ఆక్షన్‌లో పాల్గొని సరుకుని దక్కించుకుంటారు. దీనివలన గతంలో మూస పద్ధతిలో జరిగిన లావాదేవీలకు, ఈనామ్‌లో జరుగుతున్న ట్రేడింగ్‌కు ఎలాంటి వ్యత్యాసం లేకుండా పోయింది. యార్డులో వ్యాపారస్తులంతా సిండికేట్ అయి ఉన్నారు. ఏమైనా ఒత్తిడి పెడితే వెంటనే ట్రేడింగ్ నిలిపేసి రైతులకు ఇబ్బందులు కలిగిస్తారు. గతంలో పలుమార్లు ఇలాంటి సంఘటనలు జరిగాయి. కొన్ని రోజులుగా జీరో, కటింగ్, బిల్ టూ బిల్ వ్యాపారాలపై పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు వస్తుండటంతో మార్కెటింగ్ కమిషనర్ విజయ సునీత సోమవారం యార్డు సెక్రెటరీ వినుకొండ ఆంజనేయులుకు నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం నుంచి అన్నీ ఈనామ్‌లోనే జరగాలని స్పష్టం చేశారు. అందులో భాగంగానే మంగళవారం వ్యాపారస్తులతో సమావేశాలు ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు.

ఏపీఎంను సస్పెండ్ చేయాలి

● గొట్టిపాడు డ్వాక్రా సంఘాల ఆందోళన


రోడ్డుపై గొట్టిపాడు డ్వాక్రా మహిళల ధర్నా

ప్రత్తిపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మూడు గంటల పాటు తహసీల్దార్ కార్యాలయం వద్ద వేచి ఉన్నా, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఆగ్రహించిన గొట్టిపాడు డ్వాక్రా సంఘాల మహిళలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఏపీఎంను సస్పెండ్ చేయాలంటూ రాస్తారోకోకు దిగారు. గొట్టిపాడులోని రాధాకృష్ణ గ్రామైక్య సంఘానికి సంబంధించి వీవోఏ జె.శ్రీకాంతను తొలగించే విషయంతో కొంతకాలంగా రచ్చ జరుగుతుంది. ఆ గ్రామైక్య సంఘానికి సంబంధించి డ్వాక్రా సంఘాల ప్రమేయం లేకుండా అధికారులు వీవోఏను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని, అందులో భాగంగానే శ్రీనిధి బయోమెట్రిక్‌లో ఆధార్‌ను మార్చారంటూ ఆ సంఘం మహిళలు ఆరోపిస్తున్నారు. దీనిపై పూర్తి వివరాలు, ఆధారాలతో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి సుమారు 50 మంది మహిళలు వచ్చారు. తొలుత తహసీల్దార్ కరుణ కుమార్ వచ్చి మహిళలతో మాట్లాడారు. అర్జీ ఇస్తే నెల రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానన్నారు. తాము అడిగిన ప్రశ్నలకు ఏపీఎం వచ్చి సమాధానం చెప్పాలని మహిళలు పట్టుబట్టారు. బయటకు వచ్చిన ఏపీఎంను బయోమెట్రిక్ ఆధార్‌ను ఎందుకు మార్చారో చెప్పాలంటూ మహిళలు ప్రశ్నించారు. అంతేకాకుండా తమ సంఘానికి సంబంధం లేకుండా వీవోఏను ఎందుకు మార్చే ప్రయత్నం చేస్తున్నారని ప్రశ్నించారు. తమ గ్రూపునకు వీవోఏ ఎవరో చెప్పాలంటూ డిమాండ్ చేశారు. పరిశీలించి సమాధానం చెబుతానని ఏపీఎం చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆగ్రహించిన మహిళలు ఏపీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన్ను సస్పెండ్ చేయాలంటూ ప్లకార్డులు పట్టుకుని రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ట్రాఫిక్ కొద్ది సేపు ఆగిపోయింది. పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అనంతరం డ్వాక్రా సభ్యురాలు గుంటుపల్లి శివకుమారి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏపీఎం అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

పోలీసులకు ఏపీఎం ఫిర్యాదు

మహిళలు తన చేయి పట్టుకుని లాగి కొట్టబోయారని ఆరోపిస్తూ ఏపీఎం లాజర్ ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్రకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

అసైన్డ్ రైతులకు కౌలు

(5 పేజీ తరువాయి)

వీరికి చట్టబద్ధమైన కౌలు, ప్రయోజనాలు కల్పించింది. అయితే గత ప్రభుత్వం 1, 2, 3 కేటగిరీల భూములపై సీఐడీ కేసులు నమోదు చేయడం వల్ల ఆ రైతులకు సంవత్సరాది కౌలు, నివాస స్థలాలు, వాణిజ్య ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిపివేసింది. వాటిపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపి నివేదికను సీఐడీ అధికారులకు పునఃపరిశీలన నిమిత్తం పంపగా తొలి విడతలో 1,234 మంది రైతులకు అర్హత లభించిందని, వారికి చట్టబద్ధమైన ప్రయోజనాలు ఇస్తున్నట్లు ఈ ఆగస్టులో సీఆర్డీఏ, ప్రభుత్వం ప్రకటించింది. 1,234 మందికి వార్షిక కౌలు రూ. 22. 03 కోట్ల రూపాయలు జమ చేసింది.

● రెండో విడతలో..

రెండో విడతగా మరో 609 మంది రైతులకు అర్హత లభించిందని సీఆర్డీఏ కమిషనర్ తెలిపారు. వారికి రూ.2.35 కోట్లకు ప్రతిపాదనలు ఆమోదించగా, బిల్లు ఆర్థిక శాఖ వద్ద ఫండ్ క్లియరెన్సులో ఉన్నట్లు ఆయన వివరించారు. వారికి కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసేందుకు తగిన చర్యలు అధికారులు చేపట్టారని తెలిపారు. నాట్ ట్యాలీడ్ జాబితాలో వున్న 5, 6 కేటగిరీల రైతుల పొలాలపై కూడా విచారణ జరపగా 484 మంది రైతులకు అర్హత లభించిందని ఈనెల 27న వారి కౌలు చెల్లింపులకు ఆమోదం లభించిందని, వారికి కౌలు చెల్లించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశామని ఆయన తెలియజేశారు. వారి ప్లాట్ల రిజిస్ట్రేషన్లకూ ఆటంకం ఉండదని, త్వరతగతిన రిజిస్ట్రేషన్లు పూర్తి చేసేందుకు ఆదేశాలు జారీ చేశామని సీఆర్డీఏ కమిషనర్ తెలియజేశారు. కాగా 1,2,3 కేటగిరీలకు చెందిన అర్హత కలిగిన 683 మంది రైతుల వివరాలను జిల్లా కలెక్టర్ ఈనెల 26న సీఆర్డీఏ కార్యాలయానికి పంపగా దానిని సీఐడీ అధికారుల పునఃపరిశీలనకు పంపించారు. వారి ఆమోదం లభిస్తే వారికి కూడా వార్షిక కౌలుతోపాటు, చట్టపరంగా రావాల్సిన ప్రయోజనాలు అందనున్నాయి.

జాతి పరువు తీయడం.. దేశద్రోహమే

● మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్



నరసరావుపేట టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఒప్పందాల్లో రూ.1750 కోట్లు ఇచ్చినట్లు న్యూయార్క్ కోర్టులో జగన్, కొంతమంది అధికారుల పేర్లతో ఛార్జిషీటు దాఖలు అయిందని, ఇది దేశద్రోహం కిందకు వస్తుందని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. సోమవారం నరసరావుపేట పట్టణం మున్సిపల్ అతిథి గృహంలో మీడియాతో ఆయన మాట్లాడారు. న్యూయార్క్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయడంతో జాతి పరువు పోయిందనీ, కనుక ఇది దేశద్రోహమేనని చెప్పారు. రూ. 1750 కోట్లు రికవరీ చేయాలని, అందులోని నిందితులపై దేశద్రోహం కింద కేసు నమోదు చేయాలన్నారు. కోటిన్నర టన్నుల బియ్యాన్ని కృష్ణపట్నం, మచిలీపట్నం, కాకినాడ, వైజాగ్ పోర్టుల ద్వారా దోపిడీ చేశారని ఆరోపించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ పోర్టుల సందర్శనలో బియ్యం అక్రమ రవాణాను చూశాం అన్నారు. సుమారు రూ.50 వేల కోట్ల సంపద అన్నారు. ఇది పేద ప్రజలు తినే అహారం అన్నారు. జగన్ బృందం పేదల తీసుకునే ఆహారాన్ని కూడా వదలిపెట్టారా అని మాజీ మంత్రి ప్రశ్నించారు.

నందిగం సురేశ్‌కు మరో 14 రోజుల రిమాండ్


పోలీసు వ్యానులో నుంచి అభివాదం చేస్తున్న నందిగం సురేశ్

మంగళగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను తుళ్లూరు పోలీసులు సోమవారం మంగళగిరి కోర్టులో హాజరుపర్చారు. తుళ్లూరుకు చెందిన మరియమ్మ అనే వృద్ధురాలి హత్య కేసుకు సంబంధించి సురేశ్ జ్యుడీషియల్ రిమాండ్‌లో వున్నారు. రిమాండ్ గడువు సోమవారం ముగియడంతో పోలీసు వ్యానులో మంగళగిరి కోర్టుకు తీసుకువచ్చారు. న్యాయమూర్తి మరో 14 రోజులపాటు రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చారు. అనంతరం సురేశ్‌ను తిరిగి గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.

ఏసీ సర్వీసుల ఛార్జీలపై రాయితీ

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏసీ సర్వీసులపై టిక్కెట్ ఛార్జీల్లో ఆర్టీసీ రాయితీ ప్రకటించింది. ఆదివారం మినహా సాధారణ రోజుల్లో మాత్రమే రాయితీలు వర్తిస్తాయని గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం తెలిపారు. అమరావతి ఏసీ సర్వీసుకు టిక్కెట్ ఛార్జీల్లో 20 శాతం రాయితీ ఉంటుందన్నారు. అమరావతి ఏసీ సర్వీసుకు 20 శాతం రాయితీ అంటే రూ. 742ల నుంచి రూ.593కు ఛార్జీ తగ్గించనున్నట్లు తెలిపారు. అలాగే ఇంద్ర (బీహెచ్‌ఈఎల్) ఏసీ సర్వీసుకు 10 శాతం రాయితీపై రూ.585 నుంచి రూ.526కు ఛార్జీని వసూలు చేయనున్నట్లు తెలిపారు. రాయితీ ఈ నెల ఒకటో తేదీ నుంచి 31 వరకు అమల్లో ఉంటుందన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం


మాట్లాడుతున్న హైమారావు వేదికపై మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ

గుంటూరు (విద్య), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పాఠశాలలు బలోపేతం దిశగా అడుగులు వేస్తూ ముందుకు పోతుందనీ, ప్రతి శుక్రవారం గుర్తింపు పొందిన సంఘాలతో ముందుగా చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటున్నారని త్వరలో ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ అన్నారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఆఫీసు బేరర్ల సమావేశం మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం నిర్వహించారు. సమావేశంలో ఎన్‌టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సెలవులపై ఆంక్షలు పెట్టడం సరికాదన్నారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్, పీఆర్‌టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరాజు, చిగురుపాటి పినాకపాణి, జిల్లా నాయకులు యుగంధర్, బాలా త్రిపుర సుందరి, క్రమశిక్షణ సంఘం చైర్మన్ చెరుకూరి సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర అధ్యక్షుడు నడిపినేని వెంకట్రావు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111,119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

4.2 కిలోల గంజాయి స్వాధీనం


నిందితులను అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ జనార్దనరావు

చేబ్రోలు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తూ సంచరిస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 4.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెనాలి డీఎస్పీ డి.జనార్దనరావు సోమవారం తెలిపారు. చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ఆదివారం చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ పరిధిలో పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్సై డి.వెంకటకృష్ణ సోదాలు నిర్వహిస్తుండగా కామధేను సీడ్ కంపెనీ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో ముగ్గురు అనుమానితులను గుర్తించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన హృదానంద దాస్, ప్రసన్న రౌత్రే, జడజన నిందితులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద 4.2 కిలోల గంజాయి ఉంది. ఈ ముగ్గురు ఒడిశా నుంచి గంజాయిని నారాకోడూరు తీసుకువచ్చి వాటాలు వేసుకుని పంచుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. చిన్న చిన్న పొట్లాలుగా గంజాయిని మార్చి యువతకు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నట్లుగా చెప్పారు. కార్యక్రమంలో సీఐ కోటేశ్వరరావు, ఎస్సై వెంకటకృష్ణ పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

దాచేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం రామాపురం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఆశం లింగారెడ్డి (35) నివాస గృహంలో ఉరి వేసుకొని మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు లింగారెడ్డిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతునికి గతంలో రూ.15 లక్షల వరకు అప్పులు ఉన్నాయి. ఈ ఏడాది కూడా 2 ఎకరాల పత్తి, 3 ఎకరాల మిరప పంటలను సాగు చేశాడు. ఈ ఏడాది కూడా పంటలు సక్రమంగా లేకపోవడంతో బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దాచేపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లా వాసి దుర్మరణం

దాచేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆటో సాంకేతిక లోపంతో సడన్‌గా ఆగిపోవడంతో వెనుక వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు ఆటోను వెనుక వైపు ఢీకొని మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం నల్లసముద్రం గ్రామానికి చెందిన మోతుకూరి ఏడుకొండలు (32)గా గుర్తించారు. ఏడుకొండలు హైదరాబాద్ నుంచి ఒంగోలుకు హోండా షైన్ వాహనంపై వస్తున్నాడు. అతనికి ముందుగా వెళ్తున్న ఆటో సడన్‌గా ఆగిపోయింది. వేగంగా ప్రయాణిస్తున్న ఏడుకొండలు వేగాన్ని నియంత్రించలేక ఆటోను ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైయ్యాయి. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దాచేపల్లి ఎస్ఐ పాపారావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

రాజుపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - మాచర్ల రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన రాజుపాలెం గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన తురకా ప్రసాదు (32) తన ఆటోలో చంద్రాజుపాలెం నుంచి సత్తెనపల్లి వెళ్తుండగా మార్గమధ్యలోని రాజుపాలెం గ్రామ సమీపంలో ఉన్న కోళ్లఫారాలు వద్దకు వచ్చేసరికే ఎదురుగా అతి వేగంగా వస్తున్న లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్ తురకా ప్రసాదుకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో సత్తెనపల్లి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై వేణుగోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ చెన్నై సర్వీసు పునరుద్ధరణ

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో భారీ వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సోమవారం నుంచి ఆర్టీసీ చెన్నై సర్వీసును పునరుద్ధరించినట్లు గుంటూరు -1 డిపో మేనేజర్ రామకృష్ణ తెలిపారు. గుంటూరు-1 డిపో నుంచి చెన్నైకు నిత్యం ఉదయం 9.45 గంటలకు గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్ నుంచి బయల్దేరే సర్వీసును పునరుద్ధరించినట్లు తెలిపారు.

నగరంపాలెం సీఐ వ్యవహార శైలిపై..
ఎమ్మెల్యే మాధవి ఆగ్రహం

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నగరంపాలెం సీఐ వీరనాయక్‌పై స్థానిక ప్రజాప్రతినిధి గల్లా మాధవి ఆగ్రహంతో ఉన్నారు. ఆమెకు సంబంధం లేకపోయినా పలు కేసుల్లో తన పేరు వాడుతున్నట్లు ఆమె దృష్టికి వచ్చింది. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కోట్లు వసూలు చేసిన వైసీపీ నాయకుడి ముఖ్య అనుచరుడి కేసు విషయంలో సీఐ ఏకంగా ఎమ్మెల్యే పేరు వాడినట్లు ఆమె దృష్టికి వచ్చింది. కొన్ని ముఖ్యమైన కేసుల విషయంలో ప్రలోభాలకు లొంగి కేసులు నీరుగారుస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి వచ్చింది. దీంతో ఆమె సీఐ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే మాధవి నేరుగా హోమ్ మంత్రి అనితకు ఫిర్యాదు చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా హోం మంత్రి జిల్లా పోలీసు ఉన్నతాధికారులను పిలిపించి ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆయన వ్యవహారశైలిపై పోలీసు అధికారులు ప్రాథమికంగా విచారణ జరిపించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో నగరంపాలెం సీఐ వీరనాయక్‌పై బదిలీ వేటు పడే అవకాశం ఉన్నట్లు పోలీసులు వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని పట్టాభిపురం, అరండల్‌పేట సీఐలపై వేటుపడిన విషయం తెలిసిందే.



మంత్రి లోకేశ్‌కు వివాహ ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న తాడిశెట్టి మురళి, సతీమణి అమల

తాడిశెట్టి ఇంట వివాహానికి మంత్రి లోకేశ్‌కు ఆహ్వానం

గుంటూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగర మాజీ డిప్యూటీ మేయర్, టీడీపీ నేత తాడిశెట్టి మురళీమోహన్ తనయుడు వెంకటఉత్తేజ్, వధువు ఏష్నతో డిసెంబరు 14న వివా హం(గురుగ్రాం, హరియాణ), 21న గుంటూరులోని శ్రీకన్వెన్షన్‌లో జరిగే రిసెప్షన్‌కు ఆహ్వానం పలుకుతూ ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఉండవల్లిలోని ఆయన నివాసంలో తాడిశెట్టి దంపతులు శుభలేఖను అందజేశారు.

జైపూర్‌లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశీలించిన కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజ స్థాన్ రాష్ట్రంలోని జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వీధి దీపాల పర్యవేక్షణ వ్యవస్థ, రోడ్ల నిర్వహణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ద్రవ వ్యర్థాల నిర్వహణ.. ఇతర పద్ధతుల అమలును 2 రోజుల స్టడీ టూర్‌లో భాగంగా గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం పరిశీలించారు. గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (జీటీఎస్) కేంద్రాలను ప్రత్యేకంగా పరిశీలించి, ఏర్పాటు చేసిన ప్రాంతం, ప్రతి రోజు వ్యర్థాలు ఎంత వస్తుంది, వాటిని జీటీఎస్‌కి, అక్కడి నుంచి డిస్పోజ్ పాయింట్‌కి తరలించే విధానం, పరిసరాల నిర్వహణ పరిశీలించారు. చెత్తను అధునాతన విధానంలో మెకానికల్ కన్వేయర్ బెల్ట్ ద్వారా తడి, పొడిగా వేరు చేయడాన్ని పరిశీలించారు. భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించి, కేంద్రానికి వ్యర్థాలను తరలించే తీరు తెలుసుకున్నారు.

సంస్థాగత ఎన్నికలను పటిష్టంగా నిర్వహించాలి

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంస్థాగత ఎన్నికలను పటిష్టంగా జరిపించాలని పోలింగ్ బూత్, మండలంలో సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాలని టీటీడీ బోర్డు సభ్యుడు, బీజేపీ గుంటూరు జిల్లా ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి భాను ప్రకాష్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఎన్నికల సన్నాహక కార్యశాలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్ర సంఘటన మంత్రి నూకల మధుకర్‌జీ మాట్లాడుతూ సంస్థాగతంగా బీజేపీని బలోపేతం చేసేందుకు ప్రతి 6 సంవత్సరాలకు ప్రాథమిక, క్రియాశీల సభ్యత్వాలను పూర్తి చేసుకుని తద్వారా బూత్, మండల, జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర, జాతీయ అధ్యక్షులను ఎన్నుకుంటారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ తమనంపూడి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, రాష్ట్ర హెడ్ క్వార్టర్ ఇన్‌చార్జ్ మకుటం శివ, బీజేపీ సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు, జిల్లా ఎన్నికల సహా అధికారులు నేరెళ్ళ మాధవరావు, కృష్ణారెడ్డి, క్రియాశీల సభ్యత్వ ప్రముఖులు కొత్తూరు వెంకట సుబ్బారావు, ఎడ్లపాటి స్వరూపరాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాస్‌రెడ్డి, శనక్కాయల అరుణ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పంచమహాధ్యాయం చాటింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి చిన్మయ గీతా చాటింగ్ కాంపిటేషన్ హెడ్ చిన్మయమిషన్ వరల్డ్ వైల్డ్ హెచ్‌ఎస్ స్వామి స్వరూపానంద, హెచ్ స్వామి చిదాత్మానంద ఆధ్వర్యంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో భగవద్గీత పంచమహాధ్యాయం చాటింగ్ పోటీల్లో పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటారని పాఠశాల సెక్రటరీ కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ సోమవారం తెలిపారు. పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థిని ఎం.దర్శిని, ఆరో తరగతి చదువుతున్న ఆర్‌ఎస్ శ్రయాన్వి ద్వితీయ, తృతీయ బహుమతులను సాధించారని ఆయన తెలిపారు. పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, కర్లపూడి పార్వతీదేవి, కోఆర్డినేటర్స్ దుర్గాశ్యామ్, శ్రీదేవి తదితరులు విద్యార్థినులను అభినందించారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, పక్కన జేసీ భార్గవ్‌తేజ తదితరులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై ఆలసత్వం వహిస్తే సదరు అధికారులకు మెమోలు జారీ చేస్తామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్ర మానికి 153 అర్జీలు వచ్చాయి. జేసీ ఎ.భార్గవ్‌తేజ, డీఆర్వో ఖాజావలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, ఆర్డీవో కే.శ్రీనివాసరావుతో కలసి ఆమె అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల స్వీకరణ కార్యక్రమంలో అధికారులు సమయపాలన పాటించాలన్నారు. జేసీ భార్గవతేజ్ మాట్లాడుతూ కోర్టు కేసులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ కోర్టులకు కౌంటర్ దాఖలు చేయా లన్నారు. కార్యక్రమంలో సీపీవో శేషశ్రీ, డీఆర్డీఏ, డ్వామా పీడీలు శంకర్, విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, గ్రౌండ్ వాటర్ డీడీ వందనం, హార్టికల్చర్ డీడీ రవీంద్ర, మత్స్య శాఖ ఏడీ గాలి దేముడు, డీఎస్‌వో కోమలి పద్మ, డీఈవో రేణుక పాల్గొన్నారు.

ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలో జరుగుతున్న అక్రమ ఇసుక మైనింగ్ మాఫియాను నియంత్రించాలని ది ఆంధ్ర రాష్ట్ర టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.ఫణికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీనివాసరావు, షేక్ సుభాని, ఎల్.వెంకటేశ్వరరావు, జంపాల మాలకొండలరావు, లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

జిల్లాలోని రేషన్ మాఫియాను అరికట్టాలని జనసేన అధికార ప్రతినిధి ఆళ్ల హరి తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత మూడేళ్ల కాలంలోనే వైసీపీ నేతలు పేదల బియ్యాన్ని అక్షరాలా రూ.48 వేల కోట్లు విదేశాలకు తరలించారని ఆరోపించారు. వినతిపత్రం అందజేసిన వారిలో సోమి శంకరరావు, బండారు రవీంద్ర, సోమి ఉదయ్ కుమార్, దళవాయి కిషోర్, కదిరి సంజయ్, మాదాసు శేఖర్, జడ సురేష్, గోపిశెట్టి రాజశేఖర్ ఉన్నారు.

జగనన్న ఇంటి పథకంలో ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని చెప్పి గుంటూరు నగరపాలక సంస్థలో పని చేసే ఉద్యోగి రూ.3 లక్షలు తీసుకుని మోసం చేసాడని నెహ్రూనగర్ 11వ లైనుకు చెందిన పి.సుధీర్ అర్జీ అందజేశారు. సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకుని, తనకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని కోరారు.

అశాస్త్రీయ విధానంలో వందరోజుల యాక్షన్ ప్లాన్ : ఏపీటీఎఫ్

గుంటూరు(విద్య), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా పాఠశాల విద్యాశాఖ సంచాలకులు జారీ చేసిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ హేతుబద్ధం లేదని, ఇదీ అశాస్త్రీయంగా ఉందని ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు లు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖలీద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారాలు తప్పనిసరిగా ఉపాధ్యాయులు రావాలని చెప్పడం, పాఠశాలలో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు వరకు పది విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహించాలని చెప్పడం ఉపాధ్యాయులపై భారం మోపడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అశాస్త్రీయమైన 100 రోజుల ప్లాన్‌ను ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో ఉపాధ్యాయులు ఉద్యమిస్తామని తెలిపారు.

దేగలకు ఎమ్మెల్యే ప్రవీణ్ అభినందనలు



దేగల ప్రభాకర్‌కు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్‌కు పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అభినందనలు తెలిపారు. ఏపీఐడీసీ చైర్మన్‌గా దేగల ప్రభాకర్ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో దేగల ప్రభాకర్‌ను సోమవారం భాష్యం ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిచేవిధంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. నూతన పరిశ్రమల ఏర్పాటుకు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కృషి చేస్తానని దేగల ప్రభాకర్ చెప్పారు. కార్యక్రమంలో కుర్రా అప్పారావు, మేకల బాబురావు, బొక్కిసం శివరామ్, మేళం సైదయ్య, రామ్ ప్రభు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌అండ్‌జేసీ కళాశాలలో కొలరిడో-2024



పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తదితరులు

గుంటూరు(విద్య), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): చౌడవరంలోని ఆర్వీఆర్అండ్‌జేసీలో 'కొలరిడో-2024' పేరుతో ఈనెల 27, 28 తేదీల్లో సాంకేతిక, సాంస్కృతిక, క్రీడల విభాగాల్లో జాతీయస్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు డాక్టర్. రాయ పాటి శ్రీనివాస్, జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కళాశాలలో పోస్టర్స్ ఆవిష్కరించారు. 'కొలరిడో-2024' పోస్టర్, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియకి సంబంధించిన వెబ్‌సైట్‌ను కళాశాల కార్యదర్శి రాయ పాటి గోపాలకృష్ణ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు రూ.5 లక్షల వరకు నగదు బహుమతులను, జ్ఞాపికలను, సర్టిఫికెట్లను అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు https://rvrhcce.ac.in/colorido2024అనే వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్, ఆర్అండ్‌డీ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వీ శ్రీనివాసరావు, కల్చరల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ పి.కిషోర్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామాజిక స్పృహ పెంపొందించాలి



మాట్లాడుతున్న వీబీ ప్రసాద లింగం

గుంటూరు సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పాఠశాల స్థాయిలోనే సామాజిక స్పృహ పెంపొందించాలని విద్యాఫౌండేషన్ అధినేత వీబీ ప్రసాదలింగం అన్నారు. సోమవా రం గుంటూరులోని ఏటీ అగ్రహారం ప్రభుత్వ పాఠశాలలో ఉన్న విద్యార్థులకు విద్యా ఫౌండే షన్ ఆధ్వర్యంలో జనరల్ నాలెడ్జి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. వీబీ ప్రసాద లింగం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలకు అవసరమైన క్రీడా సామాగ్రిని ఆయన పాఠశాలకు అందించారు. పాఠశాలలో 5, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు జీకే పరీక్ష నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం సూపరింటెండెంట్ ఎంఎస్ మూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, హరిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఫేస్‌బుక్‌లో పరిచయమై పెళ్లి చేసుకుంటానంటూ మోసం

● ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు ఇచ్చిన బాధితురాలు

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన వ్యక్తి తనకు పెళ్లి కాలేదు అంటూ మాయమాటలు చెప్పి ఓ మహిళను ట్రాప్ చేసి ఆ తర్వాత ఆమె నుంచి పెద్ద మొత్తంలో డబ్బు గుంజి మోసం చేసిన ఘటనపై బాధితురాలు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ నగర్ కు చెందిన యువతికి గతంలో వివాహం జరిగింది. ఆమె నగరంలోని ఓ ప్రముఖ దుకాణంలో సేల్స్ విభాగంలో పని చేస్తుంది. అదే సమయంలో ఆమె హెర్బల్ లైఫ్‌లో కూడా పని చేస్తుంది. అక్కడ తన వ్యాపార నిమిత్తం ఆమె ఫేస్‌బుక్ వినియోగిస్తుండగా ఆమెకు ప్రొద్దుటూరుకు చెందిన ఫైడి కాలువ చిన్న వెంకటసుబ్బయ్య పరిచయమయ్యాడు. తనకు పెళ్లి కాలేదని, పెళ్లి చేసుకుంటానని కలిసి తిరిగారు. పెళ్లి చేసుకోకపోగా ఆమె నుంచి రూ.17 లక్షల వరకు నొక్కేశాడు. బాధిత మహిళ తన ఇంటిని తనఖా పెట్టి ఆ డబ్బును కూడా ఆయకే అప్పగించింది. చివరకు ఆరా తీయగా ఆయనకు గతంలోనే వివాహమై, ప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్లో రౌడీషీట్ కూడా ఉన్నట్లు ఆమె దృష్టికి వచ్చింది. దీంతో బాధితురాలు తన డబ్బు తనకు ఇవ్వాలని అడుగుతుంటే తన ఫోన్ నెంబరును బ్లాక్ లిస్టులో పెట్టాడని బాధితురాలు వాపోయారు. దీంతో సోమవారం ఆమె ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు జేశారు.

జీపీఆర్ఎస్ అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగర ప్రజల నుంచి పీజీఆర్ఎస్‌కు అందే అర్జీలను క్షేత్ర స్థాయి పరిశీలన చేసి సమగ్రంగా పరిష్కరించాలని నగర అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్‌ని అదనపు కమిషనర్ నిర్వహించారు. తొలుత కమిషనర్ చాంబర్లో డయల్ యువర్ కమిషనర్ ద్వారా అదనపు కమిషనర్ ప్రజల నుంచి 15 ఫిర్యాదులు తీసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఎంహెచ్‌వో డాక్టర్ రవిబాబు, మేనేజర్ బాలాజీ బాషా, డీసీపీలు, ఏసీపీలు, ఈఈలు, ఆర్‌వోలు, ఎస్ఎస్‌లు పాల్గొన్నారు.

జేకేసీ కళాశాలలో జాతీయ కాలుష్య నియంత్ర దినోత్సవం

గుంటూరు(విద్య), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాలలో సోమవారం కళాశాల ఏకో క్లబ్, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ పీ గోపీచంద్ తెలిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీరు నజీనాబేగం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం యువత కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ఎస్కే నసీమా, ఆర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎన్.లిఖిత తదితరులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు నజీనాబేగం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపిచంద్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్, ఎకో క్లబ్ సభ్యులు సుజాత, నాగసుశీల, అనితకుమారి పాల్గొన్నారు.

బాలిక హత్య కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన బాలిక హత్య కేసులో ఎట్టకేలకు నిందితుడైన నరమామిడి నాగరాజును పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సతీష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి గ్రామానికి చెందిన నాగరాజు కొత్తరెడ్డిపాలెంలో అద్దెకు ఉంటూ ఒక గ్యాస్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో కొంతకాలంగా నాగరాజు వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. అయితే కొంతకాలంగా ఆమె మరొకరితో సంబంధం కొనసాగి స్తోంది. ఈ విషయంపై అనుమానం వచ్చిన నాగరాజు బాలికను అడగ్గా ఆమె చెప్పలేదు. దీంతో తండ్రిలాగా చూసుకుంటున్న తనకు కూడా బాలిక విషయం చెప్పకుండా దాచి ఉంచిందనే కక్షతో జూలై 15న నాగరాజు బాలికను హత్య చేసి పరారయ్యాడు. నిందితుడు నాగరాజు రాజమండ్రిలో స్పిన్నింగ్ మిల్లులో పని చేస్తుండగా పోలీసులకు సమాచారం అం దింది. దీంతో పోలీసులు తనను అరెస్టు చేస్తారనే భయంతో నేరుగా చేబ్రోలు తహసీల్దార్ ఎదుట లొంగిపోయాడు. పొన్నూరు రూరల్ సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ దండా వెంకటకృష్ణ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్పీ తెలిపారు. సుమారు నాలుగు నెలల నుంచి ఎటువంటి ఆధారాలు దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని అరెస్టు చేయడంలో కృషి చేసిన తెనాలి డీఎస్పీ జనార్దన్‌రావుకు, పొన్నూరు రూరల్ సీఐ కోటేశ్వరరావుకు, చేబ్రోలు ఎస్ఐ వెంకటకృష్ణకు, పోలీస్ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

మహిళను ట్రాప్ చేసిన నకిలీ ఎస్ఐ

● ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధితురాలు



సాయితేజ

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తాను ఎస్ఐనంటూ పోలీస్ డ్రెస్‌లో దిగిన ఫొటోలను చూపించి ఓ మహిళను ట్రాప్ చేసి పెళ్లి చేసుకున్న నకిలీ ఎస్ఐ ఉదంతం గుంటూరు జిల్లాలో కలకలం రేపింది. నకిలీ ఎస్ఐపై ఆయన భార్య సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక పాత గుంటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని జియావుద్దీన్‌నగర్‌కు చెందిన ఓ మహిళకు గతంలో వివాహమై ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకున్నారు. బాధిత మహిళ తన ఇద్దరు కుమార్తెలను చదివిస్తోంది. ఆమె కొత్తపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రిసెప్షనిస్టుగా పని చేస్తుంది. రెండేళ్ల క్రితం తెనాలికి చెందిన జంధ్యాల సాయితేజ తన తల్లిని ఆస్పత్రికి తీసుకువచ్చాడు. ఆ క్రమంలో ఆమె ఫోన్ నెంబర్ తీసుకున్నాడు. ఆ తరువాత తరచుగా ఆమెకు ఫోన్ చేసి మాట్లాడుతూ ట్రాప్ చేశాడు. తనకు పెళ్లి కాలేదని, నిన్ను పెళ్లి చేసుకుంటానంటూ నమ్మించాడు. సాయి తేజ మాటలు నమ్మిన బాధిత మహిళ గత ఏడాది మార్చి 23న విజయవాడలోని కనకదుర్గమ్మ గుడిలో వివాహం చేసుకుంది. కొద్ది నెలల తర్వాత గుంటూరులో తాను పెళ్లి చేసుకున్న భార్య వద్దే ఉన్నాడు. అనుమానం వచ్చిన బాధిత మహిళ తన సోదరుడి ద్వారా వాకబు చేయగా అతడు ఎస్ఐ కాదని ఆదాయపు పన్ను ఫైల్స్ రిటర్న్స్ దాఖలు చేస్తాడని తెలుసుకున్నారు. దీంతో సాయి తేజను నిలదీయగా నిన్ను పెళ్లి చేసుకోవడం కోసమే ఎస్ఐనని చెప్పానని అన్నాడు. నాలుగు రోజుల క్రితం పాత గుంటూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని బాధిత మహిళ వాపోయారు. ఎస్ఐనని మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుని మోసం చేసిన సాయితేజపై చట్టప్రకారంతో చర్యలు తీసుకోవాలని బాధిత మహిళ పోలీస్ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులో వేడుకుంది.

23 సంవత్సరాలుగా పోరాటం చేసి అలసిపోయా..

● ఎస్పీ కార్యాలయంలో వృద్ధురాలి ఫిర్యాదు

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కబ్జా చేసిన తన పొలాన్ని తనకు ఇప్పించాలని 23 సంవత్సరాలుగా న్యాయ పోరాటం చేసి అన్ని కోర్టుల్లో విజయం సాధించినప్పటికీ పోలీసులు మాత్రం తనకు ఎటువంటి న్యాయం చేయలేదని నగరంలోని అమరావతి రోడ్డు అన్నదాన సత్రం ప్రాంతానికి చెందిన కాట్రగడ్డ సామ్రాజ్యం అనే వృద్ధురాలు ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించింది. దొప్పలపూడి గ్రామానికి చెందిన సామ్రాజ్యంకు తన అత్తింటి వారి నుంచి మన్నవలో ఎకరం పొలం సంక్రమించింది. తన భర్త మరణానంతరం ఆ పొలాన్ని ఆమె కౌలుకు ఇస్తూ వచ్చింది. అయితే 1989లో ఆ పొలాన్ని విక్రయించేందుకు నిర్ణయించుకోగా ఆమెను కాట్రగడ్డ రమేష్, ఓబయ్య అనే తండ్రి కొడుకులు సంప్రదించారన్నారు. ఈ క్రమంలో అగ్రిమెంట్ కూడా రాయించుకున్నారన్నారు. అయితే అందులో నీకు 75 సెంట్లకు మాత్రమే హక్కు ఉందని రమేష్, ఓబయ్య స్పష్టం చేశారు. అంతేగాక ఎకరం పొలం రెండు లక్షలు ఉంటే లక్షన్నరకే అగ్రిమెంట్ రాయించుకోవడం వంటి కారణాలతో సామ్రాజ్యం పొన్నూరు కోర్టులో కేసు దాఖలు చేయగా సామ్రాజ్యంకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తర్వాత ఆమె బాపట్ల కోర్టులో కూడా గెలుచుకుంది. ఆ తర్వాత జిల్లా కోర్టుకు, ఆ తర్వాత హైకోర్టుకు వెళ్లింది. అన్ని కోర్టుల్లో సామ్రాజ్యంకు అనుకూలంగా తీర్పు వచ్చింది. చివరకు కోర్టు పోలీస్ ఎయిడ్ కూడా ఇచ్చిందని బాధిత వృద్ధురాలు వాపోయారు. తన పొలం తనకు ఇప్పించమని ఎన్నో సంవత్సరాలుగా పోలీస్ కార్యాలయం, సీఐ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నానని అయినప్పటికీ పోలీసులు న్యాయం చేయడం లేదని బాధితురాలు వాపోయారు. ఆమె ఫిర్యాదును స్వీకరించిన అడ్మిన్ అదనపు ఎస్పీ రమణమూర్తి విచారణ జరిపి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. న్యాయం చేయలేని పక్షంలో తాను ఆత్మహత్య చేసుకోవ డానికి అవకాశం కల్పించాలని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

సాహిత్య పుస్తకావిష్కరణ

గుంటూరు(తూర్పు), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎల్‌బీఈడీ కళాశాల ఆవరణలో జరుగుతున్న విశాలాంధ్ర పుస్తక మహోత్సవంలో ఆలూరి బైరాగి సాహిత్య వేదికపై శిష్టా సర్వలభ్య సాహిత్య పుస్తకావిష్కరణ సభ జరిగింది. సభకు అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తకాన్ని డాక్టర్ ఎన్.విజయలక్ష్మి సమీక్షించారు. పాపినేని మాట్లాడుతూ సాహితీ చరిత్రలో కొంతమందిని పదే పదే మననం చేసుకుంటామని, అలాంటి వారిలో శిష్టా ఒకరన్నారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ కథ, రూపకం, గేయం ఇలా అన్ని సాహిత్య రూపాలను తనదైన శైలిలో రచనలు చేసిన ఘనచరిత్ర శిష్టాదని కొనియాడారు.

కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందే

● పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి
● రూ.2.76 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తమది కమీషన్ల ప్రభుత్వం కాదు కావున కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిందేనని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని 18వ డివిజల్లో రూ.2.76 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లా డుతూ నియోజకవర్గంలో పారిశుధ్య సమస్యలే అధికంగా ఉన్నట్లు గుర్తించామని, రోడ్డు మీదకు మురుగునీరు చేరి అధ్వానంగా తయారవ్వడంతో రూ.2కోట్ల 76లక్షల 50వేలతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని ఆమె చెప్పారు. పారిశుధ్య మెరుగుదల కోసం తడి, పొడి చెత్త సేకరించే సుమారు 100 పుష్ కార్ట్ బండ్లను పశ్చిమ నియోజకవర్గానికి కేటాయించామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో యూ.సాంబ, నిమ్మల వెంకట రమణ, సుఖవాసి శ్రీనివాస్, ఆళ్ల హరి, వనమా నరేంద్ర, సానం రమేష్ తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గంలో రూ.50లక్షలతో ఏడుగొందుల సందు, చల్లా వారివీధిలో సీసీ రోడ్డు, ఏడుగొందుల సందులో రూ.21.50 లక్షలతో సీసీ డ్రైన్లు, సీసీ కల్వర్టు, వెలగచెట్టు వీధి నుంచి ఆర్ అగ్రహారం వరకు రూ.25 లక్షలతో సీసీ రోడ్డు, మాజేటి కంపెనీ రోడ్డులోని మదర్ థెరిస్సా విగ్రహం నుంచి 'వై' జంక్షన్ కల్వర్ట్ వరకు రూ.50 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ఎత్తు రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నుంచి వాటర్ ప్లాంట్ వరకు రూ.50 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ఆర్ అగ్రహారంలోని లక్ష్మీనరసింహస్వామి గుడి రోడ్డులో రూ.80 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే మాధవి ప్రారంభించారు.

రహదారులను అద్దాల్లా తీర్చిదిద్దుతాం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్
● 1.26 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు. డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలో రహదారులను అద్దాల్లా తీర్చి దిద్దుతామని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. నియోజక వర్గంలోని బావాజీనగర్, ఎస్సీ కాలనీలో రూ.81.81 లక్షలతో సీసీ రోడ్లు, పైపులైన్లు, ముస్లిం శ్మశాన వాటిక నుంచి మెయిన్ రోడ్డు వరకు రూ.45 లక్షలతో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి నసీర్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకూ రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, తాజాగా రూ.కోటీ 26 లక్షలతో రోడ్లు, డ్రెయిన్లను నిర్మించనున్నామని తెలిపారు. పేదలకు అందాల్సిన రేషన్ పక్కదారి పట్టకుండా సీఎం చంద్ర బాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కఠినంగా వ్యవహరిస్తున్నారని, రేషన్ మాఫియాను అరికడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సంకూరి శ్రీనివాస్, ఆంజనేయ ప్రసాద్, చిన్న బుజ్జి, మొహమ్మద్ హాఫిజ్, అబ్దుల్ సలీం, పసుపులేటి నరేష్, దుర్గాప్రసాద్, లక్ష్మణరావు, షేక్ రఫీ, రాధిక, సుఫియా, కలాం, బాజీ పాల్గొన్నారు.

● ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు సోమవారం మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ప్రజల సమస్యలను స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రకృతితో మమేకమైతే ఆనందమైన జీవితం

● చిప్స్ ప్రొఫెసర్ విజేత

గుంటూరు(విద్య), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో మమేకమైతే ఆనందమైన జీవితం గడప వచ్చునని చేబ్రోలు హనుమయ్య ఫార్మాస్యూటికల్ సైన్సెస్(చిప్స్) ప్రొఫెసర్ పీ విజేత అన్నారు. చౌడవరంలోని శ్రీవెంకటేశ్వర బాలకుటీర్, చేతనలో సోమవారం జరిగిన క్రీడా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. బాలకుటీర్ పూర్వ విద్యార్థిని, డాక్టర్ సింధు వైష్ణవి మాట్లాడుతూ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకొని, గెలుపు కోసం ప్రయత్నించాలని సూచించారు. బాలకుటీర్ వ్యవస్థాపకురాలు ఎన్.మంగాదేవి మాట్లాడుతూ ఒత్తిడిని అధిగమించడంలో క్రీడలు ప్రముఖ పాత్రను పోషిస్తాయన్నారు. పూర్వవిద్యార్థి, మెర్క్ ఫార్మా స్యూటికల్ కంపెనీ ఏరియా బిజినెస్ మేనేజర్ పి.రాజేష్, సీఏవో దుర్గారఘురామ్, చేతన కార్య నిర్వాహకురాలు మరుద్వతి, ప్రిన్సిపాల్స్ నస్రీన్, మల్లికార్జునరావు, వెంకటేశ్వరరావు, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

మిర్చియార్డు వద్ద రోడ్డు ప్రమాదం

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని మిర్చి యార్డు సమీపంలో సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. గుర్తుతెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్ళిపోయింది. రుద్రా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు గాయపడిన వ్యక్తిని 108 ద్వారా జీజీహెచ్‌కి తరలించారు. అయితే ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

విడిపోతాం

భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు వెన్నుముక లాంటి వివాహ వ్యవస్థకు బీటలు వారుతున్నాయా...... "మూడు ముళ్లు, ఏడు అడుగులు,వందేళ్లు" అనే లెక్క తప్పుతుందా....... వైవాహికం లాంటి కీలకమైన బాధ్యతను తీసుకునేందుకు యువత విముఖత చూపుతున్నారా...... ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే అవుననే సమాధానం వస్తుంది.......చాలా మంది యాంత్రిక జీవితానికి అలవాటుపడి చిన్నపాటి కారణాలకే దూరం అవుదామని నిర్ణయించుకుని కోర్టు దాక వెళ్తున్నారు. దీనికి తోడు పరిష్కరించాల్సిన చుట్టుపక్కలవారు కూడా వీరికి మద్దతు తెలుపుతున్నారు. దాంపత్యం అంటే ఆకర్షణ, ప్రేమ కాదని అది స్పృహతో కూడిన అవగాహన, స్పృహతోకూడిన స్నేహం అని అర్థం చేసుకోలేక పోతున్నారు. ఒకరి భావాలను ఒకరు అర్థం చేసుకోకుండా.... ఆలోచనల్ని గౌరవించడం లేదంటూ వేదనకు గురవుతున్నారు. దీంతో నూరేళ్లు ఉండాల్సిన దాంపత్య జీవితాలు మధ్యలోనే ముగుస్తున్నాయి. అత్యంత పటిష్టమైన పెళ్లి అనే బంధం చిన్న చిన్న కారణాలతోనే తెగిపోతున్నది. ఈ మాత్రం దానికే విడాకులు తీసుకుంటున్నారా అంటూ న్యాయమూర్తులే విస్తుపోతున్నారు.





● పెళ్లైన నాలుగు నెలలు తిరగక ముందే టీవీ రిమోట్ దగ్గర మొదలైన గొడవ చినికి, చినికి గాలి వానలా మారి విడాకుల కోసం గుంటూరుకు చెందిన ఓ జంట కోర్టులో కేసువేశారు. ఏడాది వరకు విడాకులు ఇవ్వరని చెప్పడంతో అయితే అప్పుడే వస్తామని అంతేగాని కలసి ఉండటం కుదరదని చెప్పి అక్కడి నుంచి వెళ్లారు.

● మరో కేసులో పెళ్లి తరువాత పెట్టుపోతలు సరిగా చేయలేకపోయారని వరుడు కుటుంబానికి చెందిన వారు మాట్లాడిన మాటలు గొడవగా మారడంతో గుంటూరుకు చెందిన ఇరు కుటుంబాలు విడాకుల కోసం కోర్టుకు ఎక్కారు.

● మా అమ్మ, నాన్న మా ఇంటికి వచ్చినపుడు చికెన్ తీసుకురాలేదని భార్య చేసిన గొడవ కోర్టు మెట్లు ఎక్కేవరకు తీసుకు వచ్చింది. చెప్పిన సమయానికి రాలేదనే.... ఇష్టమైన సినిమాకి తీసుకుపోలేదనే వంటి కారణాలకే కోర్టు వరకు వచ్చే ఘటనలు మరెన్నో...... గతంలో గురక పెడుతున్నాడని, తలుపుకు తాళం వేయడం మరిచిపోయారని వంటి కారణాలతో విడాకులు తీసుకున్నారనే వార్తలు విని నవ్వుకునేవాళ్లం... ప్రస్తుతం ఆ సంస్కృతి మన మధ్యలోకే రావడం విచారించదగ్గ విషయం.

గుంటూరు(తూర్పు), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బలమైన బంధానికి నాంది కావాల్సిన అడుగులు తప్పటడుగులు అవుతున్నాయి. కుటుంబవ్యవస్థను భావితరాలకు అందించే వివాహవ్యవస్థ బలహీనపడుతుంది. వందేళ్ల కలసి బతకాల్సిన జీవితం చిన్నపాటి కారణాలతో విడిపోతున్నారు.



విడి విడిగా మంచి భర్త, మంచిభార్యగా ఉన్నవారు కూడా ఒక్కో సమయంలో మంచి భార్యభర్తలు కాలేరన్న సూత్రాన్ని గ్రహించలేకపోతున్నారు. పెళ్లైన ఆరు రోజుల నుంచి ఆర్నెల్లు గడవకముందే భాగస్వామి అర్థం కావడం లేదనో, అర్థం

- మూణ్ణాళ్ల ముచ్చటగా వివాహబంధం
- భారీగా పెరుగుతున్న విడాకుల కేసులు
- ఉమ్మడి జిల్లాలో వేల సంఖ్యలో పెండింగ్ కేసులు
- కేసుల్లో 80 శాతం కొత్తగా పెళ్లైన జంటలవే
- చిన్నపాటి వివాదాలకే కోర్టు మెట్లెక్కుతున్న నవదంపతులు
- అక్కరకు రాని కౌన్సిలింగ్ కేంద్రాలు

చేసుకోవడం లేదనో విడిపోవాలను కుంటున్నారు. ఒకరికి ఒకరు అర్థంగాకపోయినా జీవితాంతం కలిసి ఉండే బలమైన బంధమే దాంపత్యజీవితం అని గుర్తించ లేకపోతున్నారు. నిర్లిప్తత, ఒంటరితనం. ప్రేమరాహిత్యం, అస్పష్ట అపజయం అంటూ అర్థం లేని పేర్లు పెట్టి ఎవరి దారి వారు చూసుకుంటున్నారు.

పెరుగుతున్న కేసులు

గుంటూరు కార్పొరేషన్ పరిధిలో జిల్లా కోర్టులో ఉన్న ఫ్యామిలీ కోర్టులో ప్రతినెల 40కు పైగా జంటలకు విడాకులు మంజూరు అవుతున్నాయి. అంటే సరాసరిని రోజుకు రెండు జంటలు వివాహ బంధానికి స్వస్తి చెబుతున్నాయి. అంతేగాక కార్పొరేషన్ పరిధిలో నవంబరు చివరినాటికి 3వేలకు వరకు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. నెలకు జిల్లాలోని అన్ని కోర్టుల్లో నెలకు 160 వరకు జంటలు విడాకులు పొందుతున్నాయి. ఫ్యామిలీ కోర్టుతో పాటు, జిల్లా కోర్టులో నాలుగు సబ్‌కోర్టులు, నరసరావుపేట, బాపట్ల, పిడుగురాళ్ల, వినుకొండ తో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న దాదాపు 10 సబ్‌కోర్టుల్లో నిత్యం వీటి విచారణ కొనసాగుతుంది. సివిల్, క్రిమినల్ కేసుల కంటే అత్యధికంగా విడాకుల కేసులే విచారణ జరుగుతున్నాయంటే పరిస్థితి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

పెద్దవారు లేకపోవడమే కారణం..

గతంలో విడాకుల కేసులు చాలా అరుదుగా వచ్చేవి. ప్రస్తుతం అవి వందల సంఖ్యలో వస్తున్నాయి. జిల్లా కోర్టులోనే నాలుగు సబ్‌కోర్టుల్లో విచారణ కొనసాగుతున్నాయి, ఉమ్మడి కుటుంబాలు, పెళ్లైన కొత్తలో పెద్దవారి పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణం. ఒక్కోసారి భార్యాభర్తల్లో ఒకరు కలిసి ఉండాలని మరొకరు విడిపోవాలని కోరుకుంటారు. ఇటువంటి కేసులు కూడా వస్తుంటాయి. విడాకులు వద్దని ఎంత చెప్పినా వినరు. తీసుకున్న తరువాత వచ్చే ఇబ్బందులు గురించి చెప్పినా పట్టించుకోరు. చిన్నపాటి సమస్యలు వచ్చినపుడు విడాకులు వరకు రావడం మంచిది కాదు. పెద్దవారి సమక్షంలో ఇరుకుటుంబాలు ఆరోగ్యకరమైన వాతవరణంలో పరిష్కరించుకోవాలి.



పల్లపు కృష్ణ, 5వ కోర్టు అదనపు జిల్లా జడ్జి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్

● పెళ్లయిన కొత్తలోనే సమస్య

అప్పటి వరకు ఉన్న వాతావరణం, ఆప్తులు పెళ్లి తరువాత కనిపించవు. అక్కడి పరిస్థితులు అర్థం చేసుకోవడానికి కొంత సమయం పడుతుంది. ఈ సమయంలోనే చిన్నపాటి స్పర్ధలు మొదలవుతాయి వీటిని పరిష్కరించుకోగలిగితే ఆ తరువాత ఎటువంటి ఇబ్బందులు ఉండవు. జీవితం రొటీన్ అవుతుందన్న భావన కూడా రానివ్వకూడదు. అంతేగాక బయటకు వెళ్లినపుడు ఒకరినొకరు గౌరవించుకోవాలి. గొడవలు జరిగితే సర్దుకుపోవాలి. చిన్నపాటి సూత్రాలు పాటించుకుంటే వివాహ జీవితం ఆనందంగా ఉంటుంది.



-డాక్టర్ వి వెంకట కిరణ్, మానసిక వైద్య నిపుణుడు, జీజీహెచ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, జీఎమ్‌సీ

అక్కరకు రాని కౌన్సెలింగ్ కేంద్రాలు

సాధారణంగా విడాకులకు దరఖాస్తు చేసుకున్న దంపతులను కలిపేందుకు తొలిప్రయత్నంగా కౌన్సెలింగ్



జిల్లా కోర్టులోని ఫ్యామిలీ కోర్టు భవన నిర్మాణ సముదాయం

కేంద్రాలకు పంపుతారు. దంపతుల మధ్య గొడవకు కారణం కనుక్కోని వారి మధ్య సఖ్యతను కుదర్చడమే ఈ కేంద్రాల ముఖ్య విధి. కానీ జిల్లాలో కౌన్సిలింగ్ కేంద్రాలకు వెళ్లిన వారికి న్యాయం జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దిశ పోలీస్ స్టేషన్లలో, సఖి కేంద్రాల్లో జిల్లా వ్యాప్తం గా కౌన్సెలింగ్ సెంటర్లును ఏర్పాటు చేశా రు. కానీ ఇక్కడ సరైన మానసిక నిపుణు లు, అనుభవజ్ఞులు లేక చాలా కేసులు తిరిగి విడాకులకే దారి తీస్తున్నాయి. ఇతర రాష్ట్రాల మాదిరి గతంలో విడాకులు తీసుకుని ఒంటరితనం గడుపుతున్న వారి జీవితానుభవాల్ని వివరించే విధానాన్ని తీసుకువస్తే కొంతమేర ఫలితాలు ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు.

● 80శాతం యువజంటలవే.....

విడాకుల కోసం కోర్టుకు వెళ్తున్నవారిలో 80 శాతం 25-28 మధ్య వయస్సుల గల జంటలవే. విడాకుల కోసం వీరు చెప్పే కారణాలు కూడా విచిత్రంగా ఉంటాయి. ఇంత చిన్న సమస్యకు విడాకుల వరకు వస్తున్నారా అంటే అది మీకు చిన్నది కావచ్చు మాకు మాత్రం చాలా పెద్దది అంటూ సమాధానం చెబుతున్నారు. ఒకరిపై ఒకరికి విపరీతమైన అంచనాలు, ఊహించుకునే విధంగా వైవాహిక జీవితం లేకపోవడం, ప్రతి మాటకు విపరీత అర్థాలు తీయడం, ఆర్థిక భద్రత ఉండటంతో ఎలాగైన జీవించగలం అనే ధీమా. సర్దిచెప్పేవారు లేకపోవడం, లేనిపోని అపోహలు వంటి కా రణాలు విడాకుల వరకు దారితీస్తున్నాయి. సంసారంలో జరిగే ప్రతి చిన్న సంఘటనను ఇతరులతో పంచుకోవడం ఈ మధ్య అలవాటుగా మారింది. ఇది కూడా దంపతుల మధ్య ఘర్షణలకు కారణమవుతున్నాయి.

● మూడో వ్యక్తి ప్రమేయమే కారణం

దంపతుల మధ్య జరిగే గొడవల్లో మూడోవ్యక్తి జోక్యం వల్లే పరిస్థితి చేయిదాటుపోతుందని నిపుణులు చెబుతున్నారు. పెళ్లికి ముందు మనకు ఏ సమస్య వచ్చినా స్నేహితులతో పంచుకుంటాం. కాని పెళ్లి తరువాత ఏది స్నేహితులతో చెప్పుకోవాలి...ఏది కుటుంబ సభ్యులతో చెప్పుకోవాలి అనే అవగాహన చాలామందికి ఉండదు. దీంతో మూడోవ్యక్తి సలహాలను పాటించి సమస్యను జటిలం చేసుకుంటున్నారు.

● విడాకుల తరువాత తీవ్ర మనోవేదన

ఇక్కడ ఆసక్తికర విషయమేంటంటే అప్పటివరకు విడిపోవాలనుకున్నా ఒకసారి విడాకులు పొందిన తరువాత దంపతు లిద్దరూ తీవ్రమనోవేదన అనుభవిస్తారు. విడాకుల తీసుకున్న వారి పట్ల సమాజం వ్యవ హరించే తీరు, ఒంటరై పోయామనే భావన, ఇతరులు కుటుంబాలతో సంతోషంగా ఉండటం, పెళ్లైన కొత్తలో సంతోషంగా గడిపిన క్షణాలు గుర్తుకు రావడం వంటి కారణాలతో తీవ్రమానసిక వేదన అనుభవిస్తుంటారు.



సబ్ జూనియర్స్ విభాగంలో ప్రకాశం జిల్లా ఎడ్లజత ప్రథమం

కారంపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక కొత్త బస్టాండ్ వద్ద సోమవారం సబ్ జూనియర్స్ విభాగంలో ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్‌లు ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రకాశం జిల్లా మద్దిరాల మండలం, నాగులుప్పలపాడుకు చెందిన పుచ్చకాయల శేషాద్రిచౌదరి ఎడ్లజత నిర్ణీత సమయంలో 2600 అడుగుల దూరం పందెపు బండను లాగి ప్రథమస్థానం, గుంటూరు జిల్లా లింగాయపాలెంకు చెందిన యల్లం సాంబశివరావు ఎడ్లజత 1800 అడుగులతో రెండోస్థానం, తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన రోహన్ బాబు ఎడ్లజత 1683 అడుగులతో మూడోస్థానంలో నిలిచాయి. విజేత ఎడ్లజతల యజమానులకు సర్పంచ్ బాణావత్ సరస్వతి బాలునాయక్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజినేయులు, మాజీ ఎంపీపీ ర మావత్ నాగులునాయక్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, కంభంపాటి సత్యనారాయణ, సంగినేటి బాలకృష్ణలు బహుమతులను అందించారు. మంగళవారం జూనియర్స్ విభాగంలో పోటీలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ప్రథమస్థానంలో నిలిచిన ప్రకాశం జిల్లా ఎడ్లజత

శిల్పారామాన్ని సందర్శించిన నూతన సీఈవో, చైర్‌పర్సన్

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని అడవి తక్కెళ్లపాడు సమీపంలో ఉన్న శిల్పారామంలో సోమవారం రాష్ట్ర శిల్పారామాల నూతన సీఈవో వీ స్వామినాయుడు, చైర్‌పర్సన్ చేర్రెడ్డి మంజులా రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గుంటూరు శిల్పారామం కార్యాలయ, ఫీల్డ్ సిబ్బందితో మాట్లాడారు. శిల్పారామం మొత్తం కలియతిగిరి స్టాల్స్, బోటింగ్ పాండ్, గార్డెన్ పరిశీలించారు. బోటింగ్ పాండ్ ఏర్పాటు త్వరగా అయ్యే విధంగా తగిన ఏర్పాట్లను చేయాలని సూచిం చారు. ఫిర్యాదుల పుస్తకాన్ని సందర్శకులకు అందుబాటులో ఉంచాలని, వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం ఏవో శ్రీనివాస్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ నాగార్జున, డీఈవో భవాని ఇతర సిబ్బంది ఉన్నారు



శిల్పారామాన్ని సందర్శిస్తున్న స్వామినాయుడు, మంజులారెడ్డి

కృష్ణమ్మకు కార్తీక వెలుగు..

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) కార్తీకమాసం ముగిసిన మరుసటి రోజు పోలి పాడ్యమి పర్వదినం పురస్కరించుకుని వేలాది మంది భక్తులు వెలిగించిన కార్తీక దీపాలతో కృష్ణాతీరం కాంతులీనింది. సోమవారం ఉదయం పోలిస్వర్గం పేరుతో కార్తీకదీపాలను వెలిగించి పవిత్ర కృష్ణానది అలలపై వదిలేందుకు భక్తులు ఆదివారం రాత్రి అమరావతి ఆలయ ప్రాంగణంలోనే బస చేశారు. తెల్లవారు జామునే నిద్రచేసి కృష్ణానదిలో స్నానమాచరించి స్నానఘాట్ వద్ద కార్తీక దీపాలను వెలిగించి అరటి బొదెలపై ఉంచి నదిలో వదిలారు.



కృష్ణమ్మ అలలపై కార్తీక దీపాలను వదులుతున్న భక్తులు

మాఫియా పరేషన్!

(5వ పేజీ తరువాయి)

చీకటి పడిన వెంటనే బియ్యాన్ని తరలించుకుపోతున్నారు. అందుకోసం మాఫియా ప్రైవేటు వాహనాలు కొనుగోలు చేసి వాటిని ఏరోజుకారోజు తరలించుకుపోతున్నారు. వాటితోపాటు పేదలకు బియ్యాన్ని సరఫరా చేయాల్సిన ఎండీయూ వాహనాల్లోనే కొందరు బియ్యాన్ని మాఫియాకు తరలిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం మాఫియా సిండికేట్ కనుసన్నల్లోనే జరగడం విశేషం.

● బినామీ షాపులతో మాయ

జిల్లాలో చాలా షాపులు రేషన్ మాఫియా కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. ఉదాహరణకు గుంటూరు నగరంలో వున్న 204 రేషన్ షాపుల్లో 40కి పైగా రేషన్ షాపులు రేషన్ మాఫియా డాన్ అదుపులోనే వున్నాయి. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రేషన్ డాన్ వాటిల్లో పెట్టుబడులు పెట్టి పేదల బియ్యం అక్రమ మార్కెట్ మొత్తాన్ని తన గుప్పెట్లో పెట్టుకున్నాడు. షాపుల్లో వచ్చే సరుకు వ్యత్యాసాలను మిగిలిన షాపులతో అనుసంధానం చేసి ఎవరికీ తెలియకుండా బియ్యాన్ని తరలించుకుపోతున్నారు. విధిలేని పరిస్థితిలో దొరికిపోతే 'డాన్' రంగప్రవేశం చేసి చక్కదిద్దుతాడు. ఆరోపణలు వచ్చి డీలర్షిప్పుకు ప్రమాదం వస్తే డీలర్షిప్ బదిలీ బాధ్యత కూడా తీసుకుని తన అనుయాయులకే డీలర్షిప్ వచ్చేలా పావులు కదుపుతూ మాఫియాను ఏకచత్రాధిపత్యంతో నడుపుతున్నారు. ఇలా ఎక్కడికక్కడ మాఫియా సిండికేట్ వ్యవహారాలను చక్కబెట్టి యథేచ్ఛగా పేదల బియ్యాన్ని కొల్లగొడుతోంది.

● మాఫియాకు మిల్లర్ల దన్ను

రేషన్ మాఫియా అక్రమాలకు మిల్లర్లు దన్నుగా నిలుస్తున్నారు. జిల్లాలోని పెద్ద పెద్ద మిల్లర్లందరినీ మాఫియా సిండికేట్లో భాగస్వాములను చేసుకుని వారి మిల్లుల్లోనే బియ్యాన్ని ప్రాసెసింగ్ చేస్తున్నారు. ఎండీయూ వాహనదారుల దగ్గర, రేషన్ డీలర్ల దగ్గర రూ. 16 నుంచి 21 రూపాయలకు కొనుగోలు చేసిన బియ్యాన్ని మిల్లులకు తరలించి, ప్రాసెసింగ్ చేసి సన్నబియ్యం పేరుతో మార్కెట్లోకి రూ. 55 నుంచి 60 రూపాయలకు చలామణీ చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ చేపట్టిన తనిఖీల్లో 200 టన్నుల రేషన్ బియ్యం రైస్ మిల్లర్ల దగ్గర దొరికింది. రవాణాకు సిద్ధంగా వున్న లారీలను కూడా ఆయన సీజ్ చేశారు. జిల్లాలో రేషన్ మాఫియా ఎంత బలంగా వుందనేది మంత్రి స్వయంగా చేపట్టిన తనిఖీల్లో వెల్లడయింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం పేదల బియ్యం అక్రమాలపై దృష్టి సారించింది.

మిర్చి యార్డులో కలవరం

(5వ పేజీ తరువాయి)

మిర్చియార్డులో పర్సన్ ఇంచార్జిలుగా కొనసాగారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇటువంటి పద్దతిలో కొనసాగిన అధికారుల నేతృత్వంలో అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ నిర్ధారించింది. వారి పేర్లను కూడా ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ఇక్కడ పనిచేసిన ఇద్దరు సెక్రటరీలు భారీ అవినీతికి పాల్పడినట్లు నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. వారి కనుసన్నల్లోనే అన్ని వ్యవహారాలు జరిగినట్లు నిర్ధారించారు. రాజకీయ నేతల అడుగులకు మడుగులొత్తి యార్డు ఆదాయానికి పూర్తిస్థాయిలో గండికొట్టారు. ఈ-నామ్ పోర్టల్ నిర్వహణలోనూ, కటింగ్ వ్యాపారం ప్రోత్సహించటంలోనూ వీరిది కీలక పాత్ర అని తేల్చారు. లైసెన్స్‌ల రెన్యూవల్ వ్యవహారంలో ఒక సెక్రటరీ ఏకపక్షంగా వ్యవహరించినట్లు తేలింది. మొత్తం 286 లైసెన్స్‌లు ఉండగా, కేవలం 56కు మాత్రమే త్రిసభ్య కమిటీ అనుమతి పొందారు. మిగిలిన వాటికి సెక్రటరీనే రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు మామూళ్లు తీసుకొని రెన్యువల్ చేసినట్లు తెలుస్తోంది. గడచిన ఐదేళ్ల కాలంలో ఇదే సెక్రటరీలను మార్చి మార్చి యార్డు విధుల్లో నియమించారు.

లక్షల క్వింటాళ్ల మిర్చి ఈ-నామ్‌లో పెండింగ్

యార్డులో అవినీతి, అక్రమాలు జరిగేందుకు అన్ని స్థాయిలో సిబ్బంది సహకరించారు. యార్డుకు వచ్చిన మిర్చిని ఈ-నామ్‌లో అప్‌లోడ్ చేయటం, దాన్ని క్లియర్ చేయటంలో మితిమీరిన నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల క్రితం వరకు కూడా సుమారు 13 లక్షల క్వింటాళ్ల మిర్చికి సంబంధించి ఈ-నామ్‌లో పెండింగ్ స్టేటస్ చూపించినట్లు విచారణలో తేలింది. ఉద్దేశ పూర్వకంగానే ఇటువంటి పనులు చేసి జీరో, కట్ బిజినెస్‌కు ఇంచార్జీలు, సూపర్‌వైజర్లు సహకరించినట్లు తెలుస్తోంది. ఎగుమతి, దిగుమతి వ్యాపారులతో చేతులు కలిపిన సిబ్బంది రైతుల ప్రయోజనాల కు కూడా దెబ్బ కొట్టినట్లు నిర్ధారణ అయ్యింది.

ముగిసిన మందపోరు

- వివిధ జిల్లాల హాజరైన వీరాచావంతులు
- కొణతాలకు నాగులేటిలో స్నానాలు.. ఊరేగింపు
- అంకాళమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు
- నేడు ప్రధాన ఘట్టం 'కోడిపోరు'

మండల కేంద్రమైన కారంపూడిలో నిర్వహిస్తున్న పల్నాడు వీరారాధన ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన సోమవారం మందపోరు నిర్వహించారు. ఆవుల మందకు కాపలాగా ఉన్న గోపన్నను నాగమ్మ సైన్యం హతమార్చిన సంఘటన గురించి గానం రూపంలో ఆలపించారు. పీఠం నిర్వాహకులు బొగ్గరం విజయ్‌కుమార్ అయ్యవారు వివిధ జిల్లాల నుంచి వచ్చిన వీరాచారవంతులకు కంకణదారణ చేశారు. మందపోరు ఘట్టాన్ని విజయవంతంగా ముగించారు. ఉత్సవాల్లో ప్రధానమైన కోడిపోరు ఘట్టాన్ని మంగళవారం నిర్వహించనున్నారు.

కారంపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ముందుగా వచ్చిన వీరాచార వంతులు తమ కొణతములకు నాగులేటిలోని గంగధారమడుగులో స్నానమాచరింపజేసి అలంకరించారు. వీర్ల దేవాలయంలో పూజలు నిర్వహించి పొంగళ్లను నైవేద్యంగా పెట్టారు. అనంతరం ఊరేగింపుగా బయలుదేరి చెన్నకేశవ స్వామి, అంకాళమ్మ ఆలయాల్లో తీర్థం స్వీకరించారు. బ్రహ్మనాయుడు విగ్రహం, పీఠాధిపతి నివాసం వద్ద కత్తిసేవ చేశారు. మహిళా వీరాచారవంతులు అంకమ్మ పెట్టెలతో అమ్మవారికి సంబంధించిన వస్తువులు, గాజులు, ఫోటో, కుంకుమ తదితర సామగ్రితో తరలివచ్చారు. అందరూ ఊరేగింపుగా అంకాళమ్మ ఆలయానికి పూర్వీకుల ఆయుధాలతో వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంకాళమ్మ అమ్మవారికి కొలుపులు చేశారు. రాత్రివేళ పీఠాధిపతి తరుణ్‌చెన్నకేశవ అయ్యవారును ఇంటి వద్ద నుంచి ఊరేగింపుగా వీర్ల దేవాలయం వద్దకు తీసుకొని వచ్చారు. అక్కడ రాచగావు మండపంలో బ్రహ్మనా యుడు స్థానంలో పీఠాధిపతి ఆశీనులు కాగా వీరవి ద్యావంతులు మందపోరు కథను గానం చేశారు.

కులమతాలకు అతీతంగా చాపకూడు

● పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టరు, ఎస్పీ

బ్రహ్మనాయుడు ఆశించిన సర్వమత సమ్మేళనంలో భాగంగా వీరారాధన ఉత్సవాల్లో మూడో రోజున మందపోరులో భాగంగా వీర్ల దేవాలయ ఆవరణలో చాపకూడు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సహపంక్తి భోజనం చేశారు. 900 యేళ్ల క్రితమే కుల మతాలకు అతీతంగా చాపకూడును పల్నాటి బ్రహ్మనాయుడు నిర్వహించారు. మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావులు హాజరై సహపంక్తి భోజనం చేశారు. వీరుల దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. బ్రహ్మనాయుడు నృసింహకుంతాన్ని చేబూనారు. ముందుగా ఉత్సవాలకు విచ్చేసిన ప్రజాప్రతినిధులకు కూటమి నేతలు ఘనంగా స్వాగతం పలికి ర్యాలీ జరిపారు. పంగులూరి అంజయ్య, పుల్లయ్య, కుర్రి శివారెడ్డి, బొల్నేడి శ్రీను, చప్పిడి రాము, ఉన్నం లక్ష్మీనారాయణ, గోరంట్ల నాగేశ్వరరావు, సర్పంచ్ సరస్వతి బాలునాయక్, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్ జానీ, కర్నా సైదారావు, మోదీన్‌సా, బూసా రామాంజినేయులు, గోళ్ల సురేష్ యాదవ్, ఎస్‌పీఆర్ కృష్ణ, శంకర్, పూర్ణ, రాఘవ, షేక్ జానీబాషా, షేక్ నన్నేసా, తుపాకుల రత్తయ్య, బొల్నేడి హరికృష్ణ, కిలారి పవన్, కూటమి నేతలు పాల్గొన్నారు.



సహపంక్తి భోజనం చేస్తున్న ఎమ్మెల్యేలు బ్రహ్మారెడ్డి, అరవిందబాబు, వెంకట్రావు, కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు

నేడు కోడిపోరు

పల్నాటి వీరారాధన ఉత్సవాల్లో భాగంగా నాలుగవ రోజైన మంగళవారం ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన కోడిపోరును నిర్వహించనున్నారు. పల్నాటి యుద్ధానికి ప్రధాన కారణమైన కోడి పందెలను కోడిపోరు పేరుతో వీర్ల దేవాలయ ప్రాంగణంలో జరపనున్నారు. ఈ పోరును వీక్షించేందుకు వేలాదిగా ప్రజలు తరలిరానున్నారు.



మందపోరును గానం చేస్తున్న వీరవిద్యావంతుడు

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

312 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, డిసెంబరు 2: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 312 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,750, గరిష్ఠ ధర రూ.11,600, మోడల్ ధర రూ.11,600 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,750, గరిష్ఠ ధర రూ.11,600, మోడల్ ధర రూ.11,600 పలికాయి.

పశ్చిమ డెల్టా కాల్వకు
1902 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1902 క్యూసెక్కుల సాగు నీటిని సోమవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉంది. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 244 క్యూసెక్కుల నీరు, తూర్పుకాల్వకు 41, పశ్చిమ కాల్వకు 56, నిజాంపట్నం కాల్వకు 240, కొమ్మమూరు కాల్వకు 1110 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

జాతీయ పోటీలకు నూతక్కి విద్యార్థిని



నందును అభినందిస్తున్న హెచ్‌ఎం రాజీవ్‌రత్న

మంగళగిరి సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నూతక్కి నందు అనే విద్యార్థిని జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. గత నెలలో విజయనగరం జిల్లా బోగాపురంలో జరిగిన 68వ రాష్ట్రస్థాయి అండర్-14 వాలీబాల్ పోటీల్లో గుంటూరు జిల్లా బాలికల జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన నందు అద్భుత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించింది. ఏపీ బాలికల జట్టు ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ వారణాసిలో జరుగనున్న అండర్-14 జాతీయ స్థాయి వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో తలపడనుంది. జాతీయ పోటీలకు ఎంపికైన నందును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజీవ్ రత్న, పీడీ కే రజనీనాయక్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

వేంకటేశ్వర స్వామి సన్నిధిలో
టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్

తుళ్లూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భూదేవీ శ్రీదేవీ సమేత స్వయంభువు అనంతవరం వేంకటేశ్వర స్వామిని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు రాజధాని రైతులు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. టీటీడీ దత్తత తీసుకున్న అనంతవరం ఆలయం అభివృద్ధిపై వారితో భానుప్రకాష్‌రెడ్డి చర్చించారు. అనంత వరాలు కురిపించే స్వామిగా పేరొందారని రైతులు చెప్పారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఉద్యోగం ఇప్పిస్తానని
మోసగించిన వ్యక్తిపై కేసు

దుగ్గిరాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగం ఇప్పిస్తానంటూ యువకుడిని మోసగించిన వ్యక్తిపై చేసిన ఫిర్యాదు మేరకు దుగ్గిరాల పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటరవి తెలిపారు. దుగ్గిరాలకు చెందిన పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నల్లగొర్ల గణేష్‌కు రైల్వే శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ రెండేళ్ల క్రితం ఒంగోలుకు చెందిన చల్లా రవి రూ.12 లక్షల నగదు తీసుకున్నాడు. కాగా ఉద్యోగం ఇప్పించక పోవడంతో నగదు వాపసు ఇవ్వాలని ఒత్తిడి తీసుకురాగా విడతలుగా రూ.6 లక్షల వరకూ తిరిగి యిచ్చాడు. మిగిలిన నగదు ఇవ్వాలని పదేపదే అతడిని కోరినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ మేరకు గణేష్ సోమవారం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దుగ్గిరాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చిలువూరుకు చెందిన వందనం కాజ రోడ్డు మీదుగా మంగళగిరి వెళుతూ అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వందనంను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు మహేష్ యిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటరవి తెలిపారు.

జూదస్థావరంపై పోలీసుల దాడి

తాడేపల్లి టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలో జూదస్థావరంపై పోలీసులు సోమవారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మంగళగిరి మండలం కాజ గ్రామానికి చెందిన ప్రముఖ వైసీపీ నేత ఉన్నట్టు సమాచారం. మరికొందరు చుట్టుపక్కల గ్రామాల వారు కూడా ఉన్నట్టు సమాచారం. పోలీసుల దాడిలో పేకాటరాయుళ్ల నుంచి రూ.27వేల నగదు, ఒక కారు, కొన్ని కాయిన్లను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం అందింది.

40 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

తుళ్లూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని తాళ్లాయపాలెం గ్రామంలో సోమవారం తుళ్లూరు పోలీసులు రేషన్ బియ్యం పట్టుకున్నారు. గ్రామంలో ఓ చోట నిల్వ ఉంచి 40 బస్తాలను పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీ సీజ్

తుళ్లూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీని తుళ్లూరు పోలీసులు సోమవారం సీజ్ చేశారు. వెంకటపాలెం వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఇసుక లోడుతో ఉన్న లారీని గుర్తించారు. లింగాయపాలెం పరిధిలో ఓ చోట డంపు చేసి రాత్రిళ్లు రవాణా చేస్తున్నట్టు తెలిసింది. లారీని స్టేషన్‌లో ఉంచారు. ఇసుక అక్రమ రవాణాను ఉపేక్షించమని తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.

గుంటూరు - పర్చూరు రోడ్డుకు మహర్దశ

- డీటైల్డు ప్రాజెక్టు రిపోర్టుకు సన్నద్ధం
- పీపీపీ పద్ధతిలో రోడ్డుకు అవకాశం
- ఇప్పటికే మూడు పద్ధతుల్లో ప్రపోజల్స్



ప్రత్తిపాడు ప్రధాన రహదారి

ప్రత్తిపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - పర్చూరు పాత మద్రాసు రోడ్డుకు మహర్దశ పట్టనుంది. రాష్ట్రం విడిపోయిన తరువాత అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఈ రోడ్డు అభివృద్ధికి పక్కా ప్రణాళిక తయారు చేయడంతో పాటు తొలి విడతలో గుంటూరు నుంచి ఐదో మైలు వరకు రోడ్డు విస్తరించింది. పర్చూరు వరకు మొత్తం మూడు విడతల్లో రోడ్డు విస్తరణ చేపట్టారు. రెండో విడత రోడ్డు పనులు మొదలయ్యే లోపు ప్రభుత్వం మారింది. ఆనాటి నుంచి ఈ రోడ్డు విషయం మరుగున పడిపోయింది. మరలా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్ల విస్తరణ అంశం తెరపైకి వచ్చింది. మారిన పరిస్థితులకు అనుగుణంగా పాత మద్రాసు రోడ్డు విస్తరణకు మూడు పద్ధతుల్లో ప్రపోజల్స్ పెట్టారు. పీపీపీ పద్ధతిలో ఇప్పటికే ప్రపోజల్స్ ఉండగా, ఇటీవల సీఆర్ఎఫ్ కింద రోడ్డు నిర్మాణానికి రాష్ట్రం నుంచి వెళ్లిన ప్రజోజల్స్‌లో ఈ రహదారి కూడా ఉంది. అయితే తొలి విడతలో ఈ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. వచ్చే ఏడాది మార్చిలో విడుదలయ్యే రెండో జాబితాలో ఈ రహదారి ఉండే అవకాశం ఉంది. ఇది కాకుండా జాతీయ రహదారి కూడా ప్రపోజల్స్ పంపారు. అయితే ఇందులో తొలి విడతగా ఇప్పటికే ప్రపోజల్స్‌లో ఉన్న పీపీపీ పద్ధతిలో డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) కోసం ఒక కన్సల్టెన్సీకి అప్పగించేందుకు టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. త్వరలోనే టెండర్లు పిలిచే అవకాశం ఉంది. డీపీఆర్ కోసం కన్సల్టెన్సీ ఈ రహదారిపై క్షుణ్ణంగా పరిశీలన చేస్తుంది. ఎక్కడెక్కడ ఏమేమి అవసరం, ఏక్కడ ఏ నిర్మాణం చేపట్టాలి రోడ్డు వైడింగ్ ఎక్కడ చేయాలి.. ఈ రహదారిలో ఎన్ని వాహనాలు తిరుగుతున్నాయి.. అందులో హెవీ లోడ్ ఎన్ని వాహనాలు.. నాలుగు చక్రాల వాహనాలు ఎన్ని.. ఇలా పలు విషయాలపై కూలంకషంగా అధ్యయనం చేస్తారు. దీనికి సంబంధించి పూర్తి ప్రాజెక్టు రిపోర్టును ప్రభుత్వానికి సమర్పిస్తారు. ఆ తరువాత రహదారికి టెండర్లు పిలుస్తారు. ఏదేమైనా వచ్చే ఏడాదిలో పాత మద్రాసు రోడ్డుకు మోక్షం కలగనుంది.

సెంట్రల్ లైటింగ్ షురూ

ఇదే ప్రాజెక్టులోనే ప్రత్తిపాడు ప్రధాన రహదారిలో సెంట్రల్ లైటింగ్ నిర్మాణం కూడా జరగనుంది. ఎప్పటి నుంచో ప్రత్తిపాడు ప్రధాన రహదారిలో సెంట్రల్ లైటింగ్ నిర్మాణం కలగానే నిలిచిపోయింది. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి హోదాలో ప్రత్తిపాడు వచ్చిన జగన్మోహన్‌రెడ్డి సెంట్రల్ లైటింగ్‌కు హామీ ఇచ్చారు. కానీ అది కార్యరూపం దాల్చలేదు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తన ఎన్నికల హామీలో ప్రత్తిపాడుకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తానన్నారు. చెప్పిన విధంగానే గుంటూరు పర్చూరు రోడ్డు విషయంలో అధికారులతో మాట్లాడి ప్రపోజల్స్ పంపించారు. ఆయన చొరవతో త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది.

పెదకొండూరులో పామాయిల్ సాగుకు శ్రీకారం



పెదకొండూరులో నాటిన పామాయిల్ మొక్కలు

దుగ్గిరాల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో తొలిసారిగా పెదకొండూరు గ్రామంలో పామాయిల్ సాగుకు శ్రీకారం చుట్టారు. మూడేళ్లకాలంలో చేతికి వచ్చే ఉద్యానపంటగా పామాయిల్ సాగు చేస్తున్నారు. పంట చేతికి వచ్చేలోగా అంతరపంటలు సాగు చేసు కోవచ్చునని చెబుతుండటంతో రైతులు ముందుకు వస్తున్నారు. గ్రామస్థుడు కమ్మెల శ్రీనివాసరావుకు చెందిన ఏడెకరాల్లో పామాయిల్ మొక్కలను సోమవారం నాటారు. పశ్చిమ గోదావరి జిల్లా దోపిచర్ల వద్ద నర్సరీలో 12నెలలపాటు పెంచిన అనంతరం వాటిని తెచ్చి పొలాల్లో నాటారు. పట్టాదారు పాసుపుస్తకం, 1బీతో ఉద్యానశాఖ వారికి దరఖాస్తు చేసుకుంటే రూ.193ల విలువ చేసే 57 మొక్కల సొంతభూమి గల్గిన రైతులకు అందిస్తోంది. కాగా సబ్సిడీలో కేంద్ర ప్రభుత్వం 60శాతం, 40శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. స్థానిక రైతులకు 3ఎఫ్ ఆయిల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, ఉద్యానశాఖ ద్వారా, పూర్తి సబ్సిడీపై పామాయిల్ సాగుచేస్తున్నారని కమ్మెల శ్రీనివాసరావు తెలిపారు. ఉద్యానశాఖ పర్యవేక్షణలో సాగుచేసే పామాయిల్ సాగు మొక్కలు నాటే కార్యక్రమంలో సంస్థ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ చంద్రబాబు, క్లస్టర్ ఆఫీసర్ మలినేని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కార్తీక మాసం

తాడేపల్లి టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు సందర్భంగా సోమవారం పోలి పాడ్యమి వేడుకలను భక్తులు వైభవంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే పిల్లలు, పెద్దలు, మహిళలు సీతానగరం కృష్ణా నది తీరానికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం మహిళలు భక్తి శ్రద్ధలతో దీపాలు వెలిగించి అరటి దొప్పల్లో కృష్ణానదిలో వదిలి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం కలిసి రావడంతో నదీతీరంలో ఉన్న శ్రీ సోమేశ్వర స్వామి, రాజరాజేశ్వర స్వామి సంగమేశ్వర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీసోమేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారికి లక్ష బిల్వార్చన, అన్నాభిషేకం, దీపాలంకరణ, కార్యక్రమాలు అర్చకులు, ఆదిత్యశర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను టీడీపీ నేతలు సోమవారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఎర్రబాలెం గ్రామానికి చెందిన గడ్డం నాగమల్లేశ్వరికి రూ.37,539, బీమా పద్మావతికి రూ.69,782లు మంజూరయ్యాయి. చెక్కులను అందుకున్న లబ్ధిదారులు మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య మాట్లాడుతూ అప్పులు చేసి వైద్యం చేయించుకున్న పేదలకు సీఎం సహాయ నిధి కొండంత అండగా నిలుస్తుందన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ మంత్రి లోకేశ్ చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, టీడీపీ నేతలు మల్లవరపు వెంకట్, ఈపూరి పెద్దబ్బాయ్, నీలం అంకారావు, ఆకుల పానకాలరావు, తోట సాంబయ్య, ఆకుల పానయ్య, కట్టెపోగు ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అనుముల వంశీకృష్ణకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న వంశీకృష్ణ

తాడేపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దాదాపు 25 ఏళ్లుగా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు, సామాజిక ఉద్యమాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేసి ఆదివాసి సిద్ధాంతకర్తగా సామాజిక ఉద్యమకారుడిగా పేరుగాంచిన తాడేపల్లికి చెందిన అనుముల వంశీకృష్ణకు అమెరికాకు చెందిన స్టాన్‌ఫోర్డ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఉత్తమ సామాజిక సేవకుడిగా గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేసింది. నవంబరు 30న ఢిల్లీలోని నోయిడాలో శాండిల్ సూట్స్ లెమన్‌ట్రీ హోటల్‌లో జరిగిన స్నాత కోత్సవంలో వంశీకృష్ణకు డాక్టరేట్ ప్రదానం చేసి మెడల్, షీల్డ్ ఇచ్చి సత్కరించారు. ప్రస్తుతం హైకోర్టు న్యాయవాదిగా, ఆదివాసి మేధావుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా అనుముల వంశీకృష్ణ వ్యవహరిస్తున్నారు. 2019లో ఇంటర్నేషనల్ ఫ్రెండ్‌షిప్ సొసైటీ న్యూఢిల్లీ వారు భారతజ్యోతి అవార్డు ఇచ్చి సత్కరించారు. నిత్యం సామాజిక ఉద్యమకారుడిగా ఆదివాసీల సమస్యలపై సామాజిక న్యాయం కోసం పోరాడే అనుముల వంశీకృష్ణకు గౌరవ డాక్టరేట్ లభించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మహిళల చెస్ శిక్షణ శిబిరం ప్రారంభం



చెస్ శిక్షణా శిబిరాన్ని ప్రారంభించిన వైవీ రాఘవయ్య

తాడికొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం చెస్ మహిళల టీమ్‌కు శిక్షణా శిబిరాన్ని లాం చలపతి ఫార్మసీ కళాశాలలో ప్రారంభించినట్లు ఫిజికల్ డైరెక్టర్ వైవీ రాఘవయ్య పేర్కొన్నారు. సోమవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహిళా చెస్ టీమ్‌కు శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాఘవయ్య మాట్లాడుతూ ఈనెల 4వ తేదీ వరకు చెస్ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖ గీతం యూనివర్సిటీ లో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ పోటీలు జరగనున్నాయి తెలిపారు. ఏఎన్‌యూ జట్టు తరుపున జేకేసీ కళాశాల నుంచి ఎన్ వైష్ణవి, చలపతి ఫార్మసీ కళాశాల నుంచి బీ సాయితేజ, ఆర్ నాగవైష్ణవి, కే స్వప్నమాధురి, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఎన్ మేరీ, సీహెచ్ అనూషలు ఎంపికైనట్లు తెలిపారు. మహిళా జట్టుకు ఎం గోపీనాథ్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. చెస్ పోటీల్లో పాల్గొనే విద్యార్థినుల చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావులు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ భానుప్రకాష్ పాల్గొన్నారు.

చలపతి అధ్యాపకుడికి పీహెచ్‌డీ



పీహెచ్‌డీ పట్టాను స్వీకరిస్తున్న నంద ప్రకాష్

తాడికొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్ నందప్రకాష్ పీహెచ్‌డీ పొందారని కళాశాల ప్రిన్సిపాల్ ఎం చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం డాక్టరేట్ ప్రదానం చేశారు. నందప్రకాష్‌ను కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు, సెక్రటరి వై సుజిత్‌కుమార్‌లు అభినందించారు.

భూములు స్వాధీనం చేసుకున్న సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు

తాడేపల్లి టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తమకు న్యాయంగా రావలసిన నష్టపరిహారం కోసం సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు సోమవారం మరలా భూములను స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి కార్మికులు వేసుకున్న గుడిసెలను రెవెన్యూ, పోలీసు అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ పాకలు కూల్చిన స్థలాన్ని కార్మికులు తిరిగి స్వాధీనం చేసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. ఏఐఎఫ్‌టీయూ నేత కోటయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అధికారులు ఎన్ని కుయుక్తులు చేసినా కార్మికుల పోరాటాన్ని దెబ్బతీయలేరని చెప్పారు. మంగళగిరి రూరల్ సీపీఎం నాయకులు మొసలి పకీరయ్య దీక్షా శిబిరాన్ని సందర్శించి సంపూర్ణ మద్దతు తెలిపారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు కూరపాటి స్టీవెన్, శివమ్మ, ఉమానుల్లాఖాన్, ఆరిఫ్, శాస్త్రి, ఆశీర్వాదం, ఆసిఫ్, యెహోషువ, అంకయ్య, బాషా, రమాదేవి, శారద, శౌరమ్మ, సామ్రాజ్యం, ఇజ్రాయెల్, కృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గింజ కొనుగోలు చేయాలి

దుగ్గిరాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిబంధనలతో నిమిత్తం లేకుండా ప్రతి గింజ కొనుగోలు చేయాలని కోరుతూ రైతుసంఘాల నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సోమవారం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుసేవాకేంద్రాల ద్వారా జరిపే ధాన్యం కొనుగోళ్లు తేమశాతంతో సంబంధం లేకుండా జరపాలని, దళారుల బారిన పడకుండా కాపాడాలని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మన్నవ నాగమల్లేశ్వరరావు కోరారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా క్వింటాల్ రూ.2340కి కొనుగోలు చేయాలని, ఆగస్టులో కురిసిన వర్షాలతో పలుచోట్ల దిగుబడి తగ్గిందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఎకరాకు రూ.20 వేల వరకూ నష్టపోతారని, ప్రభుత్వం తేమశాతంపై పునరాలోచించి, తక్షణమే ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేయించాలని, కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమచేయాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గకు వినతి పత్రం అందించారు. రైతుసంఘం మండల అధ్యక్షుడు నడకుదురు యోగేశ్వరరావు, బ్రహ్మేశ్వరరావు, అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ ప్లాన్ ప్రకారమే వేంకటేశ్వర స్వామి ఆలయం అభివృద్ధి

- రాజధానిలో నాలుగు ప్రాకారాలతో విరాజిల్లబోతున్న శ్రీవారి ఆలయం
- త్వరలో పనులు ప్రారంభం



వెంకటపాలెంలో ఒక ప్రాకారంతో వేంకటేశ్వరస్వామి ఆలయం

తుళ్లూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వంలో సూచించిన ప్లాన్ ప్రకారమే వెంకటపాలెం వేంకటేశ్వర స్వామి టీటీడీ ఆలయం నిర్మాణ అభివృద్ధి పనులు జరగనున్నాయి. ఆలయం నిర్మాణం జరిగి భక్తులకు స్వామి వారి దర్శన భాగ్యం కలుగుతున్న సంగతి తెలిసిందే. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో సీడ్ రోడ్డుకి అను కొని 25 ఎకరాలు ఆలయ నిర్మాణానికి కేటాయించి శంకు స్థాపన చేశారు. పనులు మొదలు పెట్టారు. అందుకు 134 కోట్లు టీటీడీ కేటాయించింది. ఎన్నికల సమీపించడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత కొత్త ప్లాన్‌తో ఒక ప్రాకారంతో ఆలయ నిర్మాణం రూ.32 కోట్లతో చేపట్టి పూర్తి చేసి మమ అని పించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావటంతో పూ ర్వపు ప్లాన్ ప్రకారమే ఆలయ అభివృద్ధి పనులు చేయటానికి టీటీడీ సిద్ధమవుతుంది. నలు దిక్కుల నాలుగు ప్రాకారాలను ఏర్పాటు చేయనున్నారు. ద్వారాల్లో మార్పు జరగనున్నాయి. ఆవరణలో అర్చకుల క్వార్టర్ల నిర్మాణ స్థ లం మార్చారు. వాహన మండపం, మాడ వీదులు ముం దు ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు చేస్తారని టీటీడీ అధికారులు పేర్కొంటున్నారు. స్వామి దర్శనానికి రోజు రోజుకు భక్తులు పెరుతున్నారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా కల్పించింది. ప్రతి శనివారం అన్నదానం కార్యక్రమాన్ని దాతల సహకారంతో టీటీడీ నిర్వహిస్తుంది. ప్రస్తుతం ఒక ప్రాకారంతో ఉన్న ఆలయం నాలుగు ప్రాకారాలతో విరాజిల్లబోతుంది. స్వామి వారికి నిత్యం సమర్పించడానికి పూల తోట కూడా అభివృద్ధి పనుల్లో ఉన్నది.

సుజల పథకం తరలింపు..

ఆలయం ఆవరణలో ఎన్టీఆర్ సుజల పథకం ప్రధాన వాటర్ ప్లాంట్ ఉంది. ఇక్కడ నుండే రాజధాని గ్రామాలకు శుద్ధమైన జలం వాటర్ ట్యాంకులతో పంపిణీ చేస్తున్నారు. టీటీడీకి భూమిని కేటాయించక ముందే అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ఈ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. త్వరలో ఆలయ అభివృద్ధి పనులు మొదలు పెడుతున్న నేపథ్యంలో సుజల పథకం వేరే చోటకు మార్చాల్సి వస్తున్నది. ఎంత తొందరగా మారిస్తే అంత తొందరగా పనులు ఆరంభమవుతాయని టీటీడీ చెపుతుంది.

ముక్కోటి ఉత్సవ ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ



ముక్కోటి ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న మంత్రి లోకేశ్, అర్చకులు

మంగళగిరి సిటీ, తాడేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీ నృసింహ స్వామిదివ్యక్షేత్రంలో వార్షికంగా జరిగే ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు జనవరి పదో తేదీన జరుగనున్నాయి. ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలు, గోడప్రతులను ఉండవల్లిలోని మంత్రి నారా లోకేశ్ నివాసంలో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధనుర్మాస ప్రచార వాహనాలు ప్రారంభం

- మంగళ శాసనాలు అందించిన చిన్న జీయర్ స్వామి



ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణకు ప్రసాదం అందిస్తున్న చిన్న జీయర్ స్వామి

తాడేపల్లి టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): త్రిదండి చిన్న జీయర్ స్వామి వారు సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రం వద్ద సోమవారం భక్తులకు తీర్థ గోష్టి నిర్వహించి మంగళశాసనాలు అందించారు. రాబోవు ధనుర్మాస కార్యక్రమాన్ని ఈ నెల 16 నుంచి జనవరి 13వ తేదీ వరకు వైభవంగా మంగళగిరిలోని బాపూజీ విద్యాలయంలో నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అనంతరం జరిగిన తీర్థగోష్టి కార్యక్రమంలో ఏపీ ఎండోమెంట్ కమిషనర్ ఎస్ సత్యనారాయణ పాల్గొని స్వామివారి మంగళశాసనాలు అందుకున్నారు. ఆశ్రమ నిర్వాహ కులు పురాణం వెంకటాచార్యులు, వికాస తరంగిణి వై తులసి రామ్, వేద విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

- మంత్రి లోకేశ్‌కు ఆహ్వాన పత్రిక అందజేత

మంగళగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస వ్రత ప్రయుక్త శ్రీకృష్ణ దీక్షా మహోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ వైటీఆర్ ట్రస్టు ప్రతినిధులు సోమవారం మంత్రి నారా లోకేశ్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో వైటీఆర్ ట్రస్టు చైర్మన్ యర్రాకుల తులసీరామ్ యాదవ్, ట్రస్టు ప్రతినిధులు, జీయర్ స్వామి ఆశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన మండల పరిషత్ ఉపాధ్యక్షుడు



గుమ్మడి చంద్రయ్యను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

ఫిరంగిపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపాలెం గ్రామానికి చెందిన మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుమ్మడి చంద్రయ్య సోమవారం ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యవర్గ కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు, మండల అధ్యక్షుడు మండవ నరసింహారావు, పెరికల హృదయరాజు, కే యోహాన్, కటికల రామకోటేశ్వరరావు, నల్లజర్ల రవికుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో 'కొలరిడో -2024'



పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తదితరులు

గుంటూరు(విద్య), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): చౌడరంలోని ఆర్వీఆర్అండ్‌జేసీలో 'కొలరిడో-2024' పేరుతో ఈనెల 27, 28 తేదీల్లో సాంకేతిక, సాంస్కృతిక, క్రీడల విభాగాల్లో జాతీయస్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు డాక్టర్. రాయపాటి శ్రీనివాస్, జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కళాశాలలో పోస్టర్స్ ఆవిష్కరించారు. 'కొలరిడో-2024' పోస్టర్, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియకి సంబంధించిన వెబ్‌సైట్‌ను కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు రూ.5 లక్షల వరకు నగదు బహుమతులను, జ్ఞాపికలను, సర్టిఫికెట్లను అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు https://rvrhcce.ac.in/colorido2024అనే వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ట్రెజరర్ కొండబోలు కృష్ణప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్, ఆర్అండ్‌డీ డైరెక్టర్ కే రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ఎన్‌వీ శ్రీనివాసరావు, కల్చరల్ కమిటీ కన్వీనర్ పొన్నం కిషోర్ పాల్గొన్నారు.